వాయిస్ ఆఫ్ ప్రజలు
TGTEL/25/A2649
# వాయిస్ టుడే
VOICE OF PRAJALU
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
శుక్రవారం, ఫిబ్రవరి 13, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## జైల్లో ఒంటరితనం... కంటిచూపు కోల్పోతున్న ఇమ్రాన్‌ఖాన్



జైల్లోని ఇమ్రాన్ ఖాన్‌కు 85 శాతం కుడి కంటి చూపు నష్టం

అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆరోగ్యం విషమించిందని ఆరోపణలు

వెంటనే వైద్య పరీక్షలు జరపాలని సుప్రీం ఆదేశం

ఫిబ్రవరి 16 లోపు మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచన

పాక్ రాజకీయాల్లో కలకలం రేపుతున్న ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితి

# మొత్తం పదిన్నరేళ్లు సీఎంగా నేనే ఉంటా: రేవంత్

2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలతో నాకు అదనంగా ఆరు నెలలు

ఐదున్నరేళ్లు + మరో ఐదేళ్లుడ మొత్తం 10½ ఏళ్ల సీఎం పదవీ లక్ష్యం

జాతీయ రాజకీయాల్లోకి రానుడ నా రాష్ట్రానికే పరిమితం

కాళేశ్వరంపై సీబీఐ విచారణలో జాప్యం ఎందుకు?

కిషన్‌రెడ్డిని ప్రశ్నించిన సీఎం.. కేటీఆర్ అరెస్ట్‌పై ఈడీపై విమర్శలు

హైదరాబాద్‌ను బుల్లెట్ ట్రెయిన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలిడ త్వరలో విగ్రహావిష్కరణ



న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై ధీమా వ్యక్తం చేశారు. 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని, దాంతో తన పదవీకాలానికి అదనంగా ఆరు నెలలు లభిస్తాయని చెప్పారు. "మొదట ఐదున్నరేళ్లు, ఆ తర్వాత మళ్లీ ఐదేళ్లుడ మొత్తం పదిన్నరేళ్లు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా. నేనే రాజుడ నేనే మంత్రి. నేను ఎవరితోనూ పోల్చుకోను. జాతీయ రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన లేదు. నా రాష్ట్రానికే పరిమితం" అని స్పష్టం చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు, పార్టీ పెద్దలను కలిసిన అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎక్కడ?**

కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ కుంగుబాటు కేసులో అప్పటి సీఎం కేసీఆర్ ప్రధాన బాధ్యుడని కమిషన్ స్పష్టంచేసిందని రేవంత్ అన్నారు. అయినప్పటికీ సీబీఐ విచారణలో కేంద్రం ఎందుకు జాప్యం చేస్తోందని

(మిగతా 2వ పేజీలో)



# శంషాబాద్ కేంద్రంగా బుల్లెట్ రైళ్లు!

## కేంద్ర రైల్వే మంత్రికి సీఎం రేవంత్ ప్రతిపాదన

ఎయిర్‌పోర్టు చెంతనే మూడు హైస్పీడ్ కారిడార్ల జంక్షన్.

భూ కేటాయింపులకు సిద్ధం.. 500 ఎకరాల భూమి అప్పగింత.

హైదరాబాద్-చెన్నై మార్గాన్ని బందరు పోర్టుతో అనుసంధానించాలి.

కృష్ణా-వికారాబాద్ రైలు పట్టాలకు పూర్తిస్థాయి కేంద్ర నిధులు.

కొడంగల్ పారిశ్రామిక జోన్ల అభివృద్ధికి రైల్వే లైనే కీలకం.

బాపూఘాట్ వద్ద 'గాంధీ సరోవర్'.. రక్షణ భూముల బదలాయింపు.

మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలపై రామ్మోహన్‌నాయుడుతో భేటీ.

రాష్ట్రం నుంచి అదనపు ధాన్యం సేకరణపై కేంద్రానికి విజ్ఞప్తి

న్యూఢిల్లీ : తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తలమానికంగా ఉన్న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కేంద్రం మంజూరు చేసిన మూడు హైస్పీడ్ రైలు కారిడార్లను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. గురువారం ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ఆయన, ఈ ప్రాజెక్టుల కోసం విమానాశ్రయం సమీపంలోనే 500 ఎకరాల విలువైన స్థలాన్ని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ముఖ్యంగా హైదరాబాద్-చెన్నై కారిడార్‌ను అమరావతి మీదుగా మళ్లించి, అక్కడి నుంచి బందరు రేవుకు అనుసంధానిస్తే డ్రైపోర్టు ద్వారా సరుకు రవాణాకు ఎంతో వెసులుబాటు కలుగుతుందని వివరించారు. బెంగళూరు, పుణే మార్గాలను కూడా శంషాబాద్ నుంచే మొదలుపెడితే అది ఒక భారీ రైల్వే హబ్‌గా మారుతుందని, వెంటనే భూసేకరణ పనులు ప్రారంభించాలని విన్నవించారు. కృష్ణా-వికారాబాద్

(మిగతా 2వ పేజీలో)

# నేడే మున్సిపల్ తీర్పు



ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం

12,993 మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలిక

రాష్ట్రవ్యాప్తంగా 2,996 వార్డులు, డివిజన్ల ఫలితాలు

కాంగ్రెస్ జోరు కొనసాగుతుందా? బీఆర్ఎస్ తిరుగుబాటు చేస్తుందా?

చైర్‌పర్సన్, మేయర్ పదవులపై ముందస్తు రాజకీయ లెక్కలు



హైదరాబాద్: పట్టణ రాజకీయాలకు కీలకంగా మారిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు ప్రజాతీర్పుతో తేలనుంది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ ఎన్నికల్లో పోటీచేసిన 12,993 మంది అభ్యర్థుల అదృష్టం మరికొన్ని గంటల్లో బయటపడనుంది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధాన పార్టీల గుర్తులపై జరిగిన ఈ పురపోరు రాజకీయంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. దాదాపు 2,996 వార్డులు, డివిజన్లలో పోలింగ్ నిర్వహించగా 73.01 శాతం ఓటింగ్ నమోదైంది. బ్యాలెట్ పద్ధతిలో పోలైన ఓట్లను స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచి,

(మిగతా 2వ పేజీలో)

## మాదాపూర్‌లోని ఖానామెట్‌లో

# హైడ్రా కూల్చివేతలు.. ఉద్రిక్తత

రోడ్డు నెంబర్ 55లోని దుకాణాలను కూల్చివేసిన హైడ్రా అధికారులు

నిర్మాణాలు కూల్చివేస్తుండగా అడ్డుకున్న స్థానికులు

ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతలు చేపట్టారని ఆందోళన






## మహానగరంలో

# క్లీన్‌స్వీప్ ఖాయం: కేటీఆర్

రాష్ట్రానికి బీఆర్ఎస్సే శ్రీరామరక్షడ మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే

కాంగ్రెస్ అబద్ధ హామీలు, బీజేపీకి చిత్తశుద్ధి లేదని విమర్శ

శేరిలింగంపల్లిలో పూర్తి ఆధిపత్యం సాధిస్తాం

ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధం

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలని నేతలకు సూచన

అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 : హైదరాబాద్ మహానగరంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు

(మిగతా 2వ పేజీలో)

# మరో 114 రఫేల్ యుద్ధవిమానాలు

## రూ.3.6 లక్షల కోట్ల భారీ ప్రతిపాదనకు డీఏసీ ఆమోదం

## నేరుగా ఫ్రాన్స్ నుంచి 18 జెట్‌లు, 96 భారత్‌లోనే తయారీ



న్యూఢిల్లీ: దేశ సరిహద్దులు, గగనతలాన్ని మరింత దుర్భేద్యంగా మార్చే దిశగా భారత రక్షణ మంత్రిత్వ శాఖ మరో 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు ముందడుగు వేసింది. రూ.3.6 లక్షల కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రతిపాదనలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలో జరిగిన 'రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ)' సమావేశం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 18 రఫేల్ జెట్‌లను ఫ్రాన్స్‌లోనే తయారుచేసి నేరుగా భారత్‌కు సరఫరా చేయనున్నారు. మిగతా 96 విమానాలను భారత్‌లో దేశీయంగా తయారుచేయనున్నారు. వీటిలో సగానికి పైగా విమానాలను దేశీయంగా తయారైన విడిభాగాలతో దశలవారీగా నిర్మించనున్నారు. ఇందుకోసం అనుబంధ పరిశ్రమలు, తయారీ యూనిట్లు నెలకొల్పడం ద్వారా దేశీయ రక్షణరంగానికి గణనీయమైన ఊతం లభించనుంది.

**సూడో శాటిలైట్ల కొనుగోలు**

రఫేల్ జెట్‌లతోపాటు అత్యంత ఎత్తులో విహరించే సూడో శాటిలైట్లు (ఏఎస్‌హెచ్‌ఏపీఎస్) కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇవి సౌరశక్తితో పనిచేస్తూ సుమారు 30 కిలోమీటర్ల ఎత్తులో స్ట్రాటో ఆవరణంలో విహరిస్తాయి. నిఘా, పర్యవేక్షణ, ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్,

(మిగతా 2వ పేజీలో)

# మొత్తం పదిన్నరేళ్లు సీఎంగా నేనే ఉంటా: రేవంత్



ప్రశ్నించారు. “24 గంటల్లో కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తామని కిషన్‌రెడ్డి అన్నాడు. రెండేళ్లు గడిచినా ఎందుకు చర్యలు లేవు?” అని నిలదీశారు. రాష్ట్రం తరఫున ప్రతిపాదనలు పంపినా స్పందన లేదన్నారు. ఈఫార్ములా కేసును ఈడీకి అప్పగించామని, అయినప్పటికీ మాజీ మంత్రి కేటీఆర్‌పై చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభాకర్‌రావును విదేశాల నుంచి రప్పించామని, కేంద్ర సహకారం లేకపోవడంతో 20 నెలలు పట్టిందని చెప్పారు.

### ‘నైనీ’ కోల్‌బ్లాక్‌పై అసెంబ్లీలో ఆధారాలు

నైనీ కోల్‌బ్లాక్ విషయంలో కేంద్రం విధించిన నిబంధనలపై కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు తప్పుదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అన్ని ఆధారాలు వెల్లడిస్తానని ప్రకటించారు. రాష్ట్ర పోలీసులపై విశ్వాసం లేదంటే సంబంధిత కేసులను సీబీఐకి అప్పగించడానికి సిద్ధమని స్పష్టం చేశారు.

### కృష్ణాగోదావరి జలాలపై స్పష్టం

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు న్యాయం జరగాలని రేవంత్ అన్నారు. “గోదావరికి ఒక రూలు, కృష్ణాకు మరో రూలు ఎలా ఉంటుంది? ఏపీకి వర్తించే నిబంధనలు మాకూ వర్తించాలి” అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఎన్‌ఓసీ ఇస్తే ఏపీ ప్రాజెక్టులకు అభ్యంతరం లేదన్నారు.

### హైదరాబాద్ బుల్లెట్ ట్రెయిన్ హబ్

రాష్ట్రంలో మూడు బుల్లెట్ ట్రెయిన్ కారిడార్లు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో స్టేషన్ ఏర్పాటు చేసి, భవిష్యత్ సిటీతో అనుసంధానం చేస్తామని చెప్పారు. 2034 నాటికి బుల్లెట్ రైళ్లు అందుబాటులోకి వస్తాయని అంచనా వేశారు. మెట్రో ఫేజ్2 పనులు మార్చి 31 డెడ్‌లైన్‌తో సాగుతున్నాయని వెల్లడించారు.

### ఎఫ్‌ఎస్‌ఎల్ వివాదండ ఎన్టీఆర్‌కు భారతరత్న డిమాండ్

ఎఫ్ఎస్ఎల్‌లో కీలక కేసుల రికార్డులు కాలిపోయాయన్న ఆరోపణలను సీఎం ఖండించారు. దర్యాప్తు సంస్థలకు కేసు వివరాలు తిరిగి పంపడం సాధారణ ప్రక్రియేనని చెప్పారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జాతీయ నేత అని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. “ఎన్టీఆర్ ఏ ఒక్కరి సొత్తు కాదుఁ జాతీయ సొత్తు” అని పేర్కొన్నారు. త్వరలో హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తానని వెల్లడించారు.

### జపాన్‌ను వణికిస్తున్న హిమపాతం

టోక్యో, ఫిబ్రవరి 4: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భీకర మంచు ఉత్తర జపాన్‌ను వణికిస్తున్నది. బుధవారం నాటికి జపాన్‌లోని 15 ప్రిఫెక్చర్లు (పరిపాలనా విభాగాలు) ప్రభావితమైనట్టు తెలిసింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 35 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇండ్ల వద్ద మంచును తొలగించే క్రమంలో ప్రమాదానికి గురై చాలామంది మరణించినట్టు వార్తలు వెలువడ్డాయి. ప్రభావిత ప్రాంతాల్లో ఇండ్ల నుంచి బయటకు వెళ్లలేక, విద్యుత్తు సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. బుల్లెట్ రైళ్లు సహా చాలా రైలు మార్గాలు నడవటం లేదని ప్రభుత్వం తెలిపింది.

# నేడే మున్సిపల్ తీర్పు



నేడు గట్టి భద్రత మధ్య కౌంటింగ్ కేంద్రాలకు తరలించనున్నారు.

### ప్రధాన పార్టీలకు అగ్నిపరీక్ష

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఇది పట్టణ ప్రజల అభిప్రాయ సర్వేలా మారింది. రెండున్నరేళ్ల పాలనపై ప్రజలు ఎలా స్పందిస్తారన్నది ఈ ఫలితాల ద్వారా స్పష్టమవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తన పట్టు చూపిన బీఆర్ఎస్ పట్టణాల్లోనూ అదే శక్తిని ప్రదర్శిస్తుందా అన్నది ఆసక్తికరం. మరోవైపు లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్సాహకర ఫలితాలు సాధించిన బీజేపీ పట్టణ ఓటర్ల మద్దతును సుస్థిరం చేసుకుంటుందా అనే చర్చ సాగుతోంది. ఎంఐఎం కూడా తన ప్రభావాన్ని విస్తరించాలన్న వ్యూహంతో బరిలో ఉంది.

### 3 నుంచి 8 రౌండ్లలో ఫలితాలు

రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు కలిపి 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించి, అనంతరం సాధారణ ఓట్ల లెక్కింపును చేపడతారు. ప్రతి వెయ్యి ఓట్లను ఒక రౌండ్‌గా పరిగణిస్తారు. మున్సిపాలిటీల్లో మూడు నుంచి నాలుగు రౌండ్లలో ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉండగా, కార్పొరేషన్లలో ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఏడు నుంచి ఎనిమిది రౌండ్ల వరకు లెక్కింపు సాగవచ్చు. ప్రతి 25 బ్యాలెట్ పత్రాలను ఒక కట్టగా, 40 కట్టలను ఒక సమూహంగా ఏర్పాటు చేస్తారు. చెల్లుబాటు అయ్యే ఓట్లు, నోటా, చెల్లని ఓట్లను వేర్వేరుగా వందల లెక్కన కట్టలుగా సిద్ధం చేస్తారు. ప్రతి బ్యాలెట్‌ను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేస్తారు. లెక్కింపు పూర్తైన అనంతరం అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల సంతకాలతో ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారు.

### కఠిన భద్రతా ఏర్పాట్లు

కౌంటింగ్ కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు నిషేధం విధించారు. కేవలం అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్లకే ప్రవేశం కల్పించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. లెక్కింపు ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉండటంతో ఫలితాల అనంతరం ఊరేగింపులు, సంబరాలకు అనుమతి లేదు.

### చైర్‌పర్సన్, మేయర్ పదవులపై దృష్టి

వార్డు ఫలితాల తరువాత అసలు రాజకీయ సమీకరణాలు మొదలుకానున్నాయి. మెజారిటీ సాధించిన పార్టీలు నేరుగా అధికారం చేపట్టే అవకాశముండగా, హంగ్ పరిస్థితి వచ్చిన చోట్ల రాజకీయ చర్చలు వేడెక్కే అవకాశం ఉంది. చైర్‌పర్సన్, మేయర్ పదవుల కోసం ముందస్తు వ్యూహాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లలో మొత్తం 414 డివిజన్లు ఉండగా, 116 మున్సిపాలిటీల్లో 2,582 వార్డులు ఉన్నాయి. కరీంనగర్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 66 డివిజన్లు ఉండగా, నల్లగొండలో అత్యల్పంగా 48 డివిజన్లు ఉన్నాయి. మొత్తానికి, పట్టణ ఓటరు తీర్పు ఏ దిశగా ఉంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేకెత్తిస్తోంది. నేడు వెలువడే ఫలితాలు రాబోయే ఎన్నికల రాజకీయ సమీకరణాలకు మార్గదర్శకంగా నిలవనున్నాయి.

# మరో 114 రఫేల్ యుద్ధవిమానాలు



టెలికమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్ సేవలను అందించగల సామర్థ్యం వీటికి ఉంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో దసాల్ట్ ఏవియేషన్‌తో చర్చలు వేగం పుంజుకున్నాయి. గత 10 నెలలుగా విస్తృతస్థాయిలో జరిగిన చర్చల అనంతరం ఈ ఏడాది చివరిలోపు సమగ్ర ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. విమానాల తయారీతోపాటు సాంకేతిక పరిజ్ఞానం బదిలీ అంశాలపై ఇంకా చర్చలు కొనసాగనున్నాయి. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) తుది ఆమోదం ఇవ్వాల్సి ఉంటుంది. అదనపు రఫేల్ జెట్‌లు చేరితే భారత వాయుసేన దాడి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని రక్షణ శాఖ పేర్కొంది. శక్తివంతమైన క్షిపణులతో సుదూర లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించే సామర్థ్యం మరింత బలోపేతమవుతుందని వివరించింది.

### గత ఒప్పందాల నేపథ్యం

2015లో భారత వాయుసేనలో స్క్వాడ్రాన్ల సంఖ్య తగ్గిపోవడంతో 36 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు భారత్‌ఫ్రాన్స్ మధ్య ఒప్పందం కుదిరింది. ఆ జెట్‌లు ప్రస్తుతం సేవలందిస్తున్నాయి. అదే నేపథ్యంలో 114 బహుళ ప్రయోజనకర యుద్ధవిమానాల (ఎంఆర్ఎఫ్ఏ) అవసరాన్ని వాయుసేన ప్రస్తావించగా, ప్రపంచ ప్రముఖ సంస్థలు పోటీపడ్డాయి. దసాల్ట్, లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, యూరోఫైటర్ కంపెనీలు ఆసక్తి చూపాయి. భారత వాయుసేనకు గరిష్టంగా 42 స్క్వాడ్రాన్ల అనుమతి ఉన్నప్పటికీ ప్రస్తుతం సంఖ్య తక్కువగా ఉండటంతో కొత్త సమీకరణ అత్యవసరంగా భావిస్తున్నారు.

### సైన్యం, నేవీకి అదనపు బలగాలు

డీఏసీ సమావేశంలో భారత సైన్యం కోసం దేశీయంగా తయారైన వైభవ్ ట్యాంక్ విధ్వంసక మందుపాతరలు, ఆర్మ్డ్ రికవరీ వెహికల్స్ (ఏఆర్‌వీ), ఉభయచర ఫైటింగ్ వెహికల్స్ (బీఎంపీ2), టీ72 ట్యాంకుల కొనుగోలు ప్రతిపాదనలకూ ఆమోదం లభించింది. భారత నౌకాదళం కోసం పీ8ఐ నిఘా విమానం, అలాగే దేశీయంగా తయారుచేసే నాలుగు ఎండబ్ల్యూ మెరైన్ గ్యాస్ టర్బైన్ ఆధారిత ఎలక్ట్రిక్ పవర్ జనరేటర్ల కొనుగోలు నిర్ణయాలు కూడా తీసుకున్నారు. దేశ భద్రతను బలోపేతం చేసే దిశగా భారీ సమీకరణ ప్రక్రియ ప్రారంభమైందని రక్షణ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయి: కవిత



### తెలంగాణ వచ్చినా ఉద్యమకారుల కుటుంబాలకు అన్యాయం జరిగిందన్న కవిత

### బడ్జెట్ లో ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్

### త్వరలోనే రాజకీయా పార్టీ పెడతామని వెల్లడి

కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమం సాగినప్పుడు ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని భావించామని... కానీ రాష్ట్రం వచ్చాక తీరని అన్యాయం జరిగిందని కేసీఆర్ కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత మాట్లాడుతూ... ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావడం తెలంగాణ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాబోయే బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరి మురళి వంటివారు రేవంత్‌తో కలవడంతోనే తాము కాంగ్రెస్‌ను నమ్మామని... కానీ రెండున్నరేళ్లుగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. బడ్జెట్ లో హామీలకు సంబంధించిన నిర్ణయాలు లేకపోతే కోదండరామ్ ను ప్రశ్నిస్తామని హెచ్చరించారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతామని కవిత ప్రకటించారు. అది పక్కా రాజకీయ పార్టీ కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ అని స్పష్టం చేశారు. సహనశీలత లేకపోవడం, అహంకారం కారణంగానే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, మంచితనం, భోళాతనం తెలంగాణ తత్వమని చెప్పారు. అవి కోల్పోతే మనల్ని మనం కోల్పోయినట్టేనని అన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల వైపే ధర్మం ఉందని, వారి కోసం పోరాటం చేస్తామని కవిత ప్రకటించారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో తెలంగాణ బిడ్డలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జయశంకర్ సార్ విగ్రహం కేబీఆర్ పార్క్‌లో లేదా ట్యాంక్ బండ్‌పై పెట్టాలని అప్పట్లో మున్సిపల్ శాఖ మంత్రిని ఎన్నోసార్లు అభ్యర్థించినా సాధ్యం కాలేదని అన్నారు.




### మాదాపూర్‌లోని ఖానామెట్‌లో

# హైడ్రా కూల్చివేతలు.. ఉద్రిక్తత

### రోడ్డు నెంబర్ 55లోని దుకాణాలను కూల్చివేసిన హైడ్రా అధికారులు

### నిర్మాణాలు కూల్చివేస్తుండగా అడ్డుకున్న స్థానికులు

### ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతలు చేపట్టారని ఆందోళన

హైదరాబాద్‌లోని మాదాపూర్ ఖానామెట్‌లో ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబర్ 55లో రోడ్డుపై ఉన్న దుకాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇక్కడి అర్ధనారీశ్వర ఆలయం సమీపంలోని నిర్మాణాలను కూల్చివేస్తుండగా ఆలయ కమిటీ సభ్యులు, పుజారులు, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిర్మాణాలపై స్టేటస్ కో ఉందని అయినప్పటికీ హైడ్రా అధికారులు కూల్చివేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేతలు చేపట్టారని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్డు నిర్మించారని ఆరోపిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

## శంషాబాద్ కేంద్రంగా బుల్లెట్ రైళ్లు!

రైల్వే లైన్ నిర్మాణ వ్యయాన్ని కేంద్రమే భరించాలని, భూసేకరణ భారం తాము మోస్తామని హామీ ఇచ్చారు. ఈ మార్గంలోని సున్నపురాయి నిక్షేపాలు పరిశ్రమలకు వరమని, కొడంగల్ ప్రాంతం పారిశ్రామికంగా ఎదగడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

### మూసీ తీరాన ఆధ్యాత్మిక వెలుగులు

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన ముఖ్యమంత్రి, మూసీ నదీ తీరంలో తలపెట్టిన ‘గాంధీ సరోవర్’ ప్రాజెక్టు భూమిపూజకు ఆహ్వానించారు. బాపూఘాట్ వద్ద నిర్మించనున్న ఈ ప్రతిష్టాత్మక కేంద్రం కోసం రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న 100 ఎకరాలను రాష్ట్రానికి అప్పగించాలని కోరారు. అలాగే, మామునూరు విమానాశ్రయం పనుల వేగవంతం కోసం పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి, భూసేకరణ పూర్తయిన విషయాన్ని గుర్తుచేశారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు అవసరమైన అదనపు భూములపై కూడా చర్చించారు.

### ధాన్యం సేకరణపై వినతి

కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన రేవంత్, రాష్ట్రంలో పండిన అదనపు 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా సేకరించాలని కోరారు. పాత బకాయిలు రూ.1,800 కోట్లకు పైగా విడుదల చేయాలని, మిల్లింగ్ గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌లను కలిసి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, సంక్షేమ పథకాల అమలుపై నివేదిక సమర్పించారు. చివరగా ‘రైట్స్’ సంస్థ ప్రతినిధులతో హైస్పీడ్ కారిడార్ల రూపకల్పనపై చర్చించి పలు సూచనలు చేశారు.

## మహానగరంలో క్లీన్‌స్వీప్ ఖాయం: కేటీఆర్

స్పష్టం చేశారు. ఎన్ని కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ప్రజాభిమానం మాత్రం బీఆర్ఎస్‌కే ఉందని ధీమా వ్యక్తం చేశారు. నగర రాజకీయాల్లో గులాబీ పార్టీ ఆధిపత్యాన్ని ఎవరూ దెబ్బతీయలేరని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి బీఆర్ఎస్సే రక్షణ కవచమని, ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. కేంద్రంలో పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ అభివృద్ధికి గణనీయంగా ఏం చేయలేదని ఆరోపించారు. “పూజకు పనికిరాని పువ్వు బీజేపీ” అంటూ ఎద్దేవా చేసిన కేటీఆర్, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఆ పార్టీ వైఖరి ప్రజలకు స్పష్టమైందన్నారు. వెట్టి పనికైనా, మట్టి పనికైనా ఇంటి వారే అవసరమని పెద్దలు చెప్పిన మాటలను ఉదహరిస్తూ, తెలంగాణకు బీఆర్ఎస్ మాత్రమే నిజమైన శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలో క్లీన్‌స్వీప్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేసిన ఆయన, నగరంలోని ప్రతి డివిజన్‌లోనూ పార్టీ బలంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు గట్టి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని పార్టీ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు సూచించారు. లెక్కింపు ప్రక్రియలో జాగ్రత్తలు తీసుకోవాలని టెలికాన్ఫరెన్స్ ద్వారా మార్గనిర్దేశం చేశారు. ప్రతి ఓటు విలువైనదని, విజయం కోసం చివరి క్షణం వరకు కట్టుదిట్టంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలో గులాబీ జెండా మరింత ఎగసి పడేలా కార్యకర్తలు శ్రమించాలని కేటీఆర్ కోరారు.

## జైల్లో ఒంటరితనం... కంటిచూపు కోల్పోతున్న ఇమ్రాన్ ఖాన్!

పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉన్న ఆయన తన కుడి కంటిలో 85 శాతం చూపు కోల్పోయినట్లు వెల్లడైంది. ఈ విషయంపై స్పందించిన పాక్ సుప్రీంకోర్టు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీ (కోర్టు సహాయకుడు) బారిస్టర్ సల్మాన్ సఫ్దర్, జైల్లో ఇమ్రాన్ ఖాన్‌ను కలిసిన తర్వాత ఈ వివరాలను నివేదిక రూపంలో కోర్టుకు సమర్పించారు. తన కుడి కంటి చూపు కేవలం 15 శాతానికే పరిమితమైందని ఇమ్రాన్ స్వయంగా చెప్పినట్లు నివేదికలో పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం వరకు బాగానే ఉన్న కన్ను, ఆ తర్వాత మసకబారడం మొదలైందని, ఈ విషయాన్ని జైలు అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదని ఆయన వివరించారు. వైద్య పరిభాషలో ‘రైట్ సెంట్రల్ రెటినల్ వీన్ ఆక్లూజన్‘ (రక్తనాళంలో అడ్డంకి) కారణంగా కంటి చూపు దెబ్బతిన్నట్లు తేలింది. అక్టోబర్ 2025 వరకు ఇమ్రాన్ కంటి చూపు సాధారణంగానే ఉందని, సరైన సమయంలో చికిత్స అందించకపోవడం వల్లే పరిస్థితి విషమించిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు రెండున్నరేళ్లుగా ఆయన్ను ఏకాంత గదిలో ఉంచడం కూడా ఆయన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిందని నివేదికలో తెలిపారు. ఈ నివేదికను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యాహ్యా అఫ్రిదీ నేతృత్వంలోని ధర్మాసనం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఫిబ్రవరి 16వ తేదీలోగా స్పెషలిస్ట్ వైద్యులతో మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయన వ్యక్తిగత వైద్యుడిని సంప్రదించేందుకు, కుమారులతో ఫోన్‌లో మాట్లాడేందుకు అనుమతించాలని కూడా ఆదేశించింది. ఈ పరిణామం పాకిస్థాన్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తుండగా, ఇమ్రాన్ త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



## ఫాగింగ్ వాహనాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- బీరప్ప గడ్డ డివిజన్లో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలను ఇబ్బంది పెడుతున్న సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు. బీరప్ప గడ్డ డివిజన్ సీనియర్ నాయకులు ఇర్షాద్ ఖాన్ తన వంతు ప్రయత్నాన్ని ప్రారంభించారు. దోమల నివారణ కోసం సొంతంగా ఫాగింగ్ మిషన్ అందుబాటలోకి తెచ్చారు. ఫాగింగ్ మిషన్ వాహనాన్ని గురువారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుమూల పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బీరప్ప గడ్డ డివిజన్లో ప్రజలు దోమలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని దోమల నివారణకు డివిజన్ లో ప్రతి బస్తీలో మరి కాలనీలలో ఫాగింగ్ చేపట్టాలని ఉప్పల్ నియోజవర్గంకాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఇర్షాద్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈర్షద్ ఖాన్, చిలకనగర్ డివిజన్ ఇంచార్జ్ ఆకిటి ఆగం రెడ్డి, మోషిన్, అఫ్జల్, అన్వర్, ఆసిఫ్, ఆమీర్, యాసిన్,నవీద్, పాండు, జునైడ్,పవన్ జయమ్మ,అనిత,అశూక బీరప్పగడ్డ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



## రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావును ఘనంగా సత్కరించిన మాజీ ఎమ్మెల్యే ఎన్ఎస్ఎస్ ప్రభాకర్

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- రామంతపూర్ డివిజన్లో గత ఐదు సంవత్సరాలుగా ప్రజాసేవను ధ్యేయంగా తీసుకుని అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు ని ఎన్ఎస్ఎస్ ప్రభాకర్ బుధవారంరోజు తన స్వగృహంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, రామంతపూర్ డివిజన్ అభివృద్ధిలో శ్రీవాణి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆమె చూపుతున్న అంకితభావం, పట్టుదల మరియు సేవా దృక్పథం ఆదర్శప్రాయమని అన్నారు. భవిష్యత్తులో ఆమె ఇంకా ఉన్నత స్థాయికి ఎదిగి మరింత విశాల స్థాయిలో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని జగదీష్,డివిజన్ అధ్యక్షులు సంతోష్ గుప్తా , రేపు నరసింహ , సంకురి కుమారస్వామి, నారాయణదాసు, దయాకర్ రెడ్డి, వేముల తిరుపతయ్య తమ్మాల రవి తాళ్లమంగ అంబటి భాగ్యలక్ష్మి శైలేందర్ టి ఆనంద్ తదితరులు పాల్గొని తమ శుభాకాంక్షలు తెలియజేశారు.




## పటాన్‌చెరు పట్టణంలో సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

పటాన్ చెరు (వాయిస్ టుడే): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు నూతన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పటాన్‌చెరు పట్టణంలో సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్, సిఐటియు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు మల్లికార్జున్ రాష్ట్ర సభ్యులు రాజయ్య గవాజిద్, అలాగే వివిధ రాష్ట్ర, జిల్లా నాయకులు మరియు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్న ఈ లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రతకు తీవ్రమైన ముప్పు ఏర్పడుతుందని, కార్మిక వర్గం జీవనోపాధి దెబ్బతింటుందని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు.

## సెల్‌ఫోన్ల చోరీ ముఠా అరెస్టు

ఆసిఫ్‌నగర్: రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ముఠాను మెహిదీపట్నం పోలీసులు అరెస్టు చేశారు. ఠాణాలో గురువారం అదనపు డీసీపీ కృష్ణాగౌడ్, ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోల్కొండ డీసీపీ చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సాగర్‌కుమార్(28) కొద్ది నెలల క్రితం నగరానికి వచ్చాడు. బంజారాహిల్స్‌లో కిరాయికి ఉండి, తర్వాత కాచిగూడ చప్పల్‌బజార్ ప్రాంతానికి మకాం మార్చాడు. పశ్చిమబెంగాల్‌కు చెందిన అనీల్‌కుమార్ అలియాస్ అనీల్(25), గౌరవ్ సోనియా(18), ఝార్ఖండ్‌లోని షెబ్‌గంజ్, రాజ్‌మహల్ నివాసి పరన్‌కుమార్(25), దేవకుమార్(21)లను నగరానికి రప్పించి తన వద్ద ఆశ్రయం కల్పించాడు. వారిని సెల్‌ఫోన్ల చోరీకి పురమాయించాడు. నలుగురు కలిసి బస్టాండులు, రైల్వే స్టేషన్లలో సంచరిస్తూ తలుపుల వద్ద ప్రయాణికులు ఎక్కి, దిగే సమయంలో సెల్‌ఫోన్లు చేరీ చేస్తారు. ఒంటరిగా వెళ్తున్న వారిని బెదిరించి గుంజుకుంటారు. ఇలా చోరీ చేసిన ఫోను సాగర్‌కుమార్‌కు అప్పగిస్తున్నారు. అతడు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. నలుగురికి రోజు రూ.వెయ్యి నగదుతో పాటు ఆశ్రయం, భోజన వసతి కల్పిస్తున్నాడు. మెహిదీపట్నంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6లక్షల విలువైన 21 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సాగర్‌కుమార్ వద్ద మరో 30 సెల్‌ఫోన్ల ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# కన్నెర్ర చేసిన కార్మిక లోకం..




## కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: సామెల్ కార్తీక్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే): భారత దేశం నరేంద్ర మోడీ పాలనలో ఆర్థికంగా పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోనుందనీ, పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన పలు కీలక బిల్లులను చూస్తే ఇట్టే అర్థమైపోతుందని టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్ అన్నారు. అగ్రరాజ్యం అమెరికాతో ట్రేడ్ ఒప్పందాలు చేసుకున్న విధానం పలు అనుమానాలకు తావిస్తుందనీ, గతం కర్షకుల ఆగ్రహానికి గురైన బీజేపీ ఇప్పుడు కార్మిక లోకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్ ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... పుష్కర కాల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని, ఒకప్పుడు ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో మాజీ ప్రధాని తెలంగాణ ఠీవి పీవీ నర్సింహారావు, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బలమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసి ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడిందని అన్నారు. అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో దేశం పారిశ్రామిక రంగం అభివృద్ధికి బాటలు వేసి, ఎనిమిది గంట పని కి చట్టబద్ధత కల్పించి కార్మికుల హక్కులను కాపాడింది. నేటి అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందం వల్ల దేశంలోని టెక్స్టైల్ రంగం, వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యం కావడం తథ్యమని జోస్యం చెప్పారు. అబ్కి బార్ చార్ సౌ్ అన్నవాళ్ళని 200 సవ్ కి పరిమితం చేశామని గుర్తు చేశారు. నేడు తెలంగాణ రాష్ట్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందిస్తున్న ప్రజా పాలన రానున్న రోజుల్లో దేశంలో ప్రజలందరికీ అందించడానికి రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని అన్నారు. అందుకోసం కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని. బీజేపీ ప్రభుత్వం అనుకరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్మికులకు అండగా నిలిచి వారి అభ్యున్నతి దిశగా అడుగులు వేస్తున్నామని సామల్ కార్తీక్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, సిపిఐ, సిపిఎం, ఐఎన్టియుసి, లేబర్ సెల్ మరియు కర్షక సంఘాలు పాల్గొని ధర్నా అనంతరం అంబేద్కర్ విగ్రహం నుండి మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.



## 15న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 32వ అఖండ జ్యోతి రథయాత్ర

### యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 12: శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 32వ అఖండ జ్యోతి రథయాత్ర ఈ నెల 15వ తేదీన బర్కత్ పుర లోని యాదాద్రి భవన్ నుంచి ప్రారంభమవుతుందని యాత్ర కమిటి చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి, గౌరవ సలహదారులు పడాల శ్రీకాంత్, అధ్యక్షుడు యం.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి బొమ్మల సుదీష్ కుమార్ తెలిపారు. గురువారం బర్కత్ పుర యాదాద్రి భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖండ జ్యోతి రథయాత్ర ప్రచార పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ తేదీన ఆదివారం బర్కత్ పుర లో రథయాత్ర ప్రారంభమై 18వ తేదీన యాదగిరి గుట్టకు చేరుకుని అఖండ జ్యోతిని ఆలయంలో అందించడం జరుగుతుందని తెలిపారు. 15న రథయాత్ర ప్రారంభమై బర్కత్ పుర, చిక్కడపల్లి, విద్యానగర్, అడిక్మెట్, తార్నాక, హబ్సిగూడ, ఉప్పల్, 16న ఉప్పల్, ఫిర్జాదిగూడ, మేడిపల్లి, నారపల్లి, అన్నోజిగూడ, శివారెడ్డిగూడెం, ఘట్కేసర్, 17న ఘట్కేసర్, కొండమడుగు, బీబీనగర్, గూడూరు, పగిడిపల్లి, భువనగిరి, 18న భువనగిరి, రాయగిరి, వడాయిగూడెం మీదుగా యాదగిరి గుట్టకు రథయాత్ర చేరుకుంటుందన్నారు. రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కంభం అనిల్ కుమార్ రెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహ్మా మూర్తి, ఆలయ ఈవో జె.భవాని శంకర్, నగరిగారి ప్రీతమ్ కుమార్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యాదాద్రి భవన్ మేనేజర్ రామ కోటేష్, రథసారధి ఎ.గణపతి, ఎ. అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.60 లక్షలతో ఏటీఎం క్యాష్ డిపాజిట్ వ్యాన్ డ్రైవర్ పరారీ



రాయదుర్గం: ఏటీఎం క్యాష్ డిపాజిట్ వ్యాన్ డ్రైవరు రూ.60 లక్షలతో పరారైన ఘటన గోపనపల్లిలో జరిగింది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ బాలరాజు కథనం ప్రకారం.. ఏటీఎంల్లో నగదు నిర్వహణ చేపట్టే సీఎంస్ (క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్) సంస్థ కార్యాలయం తిరుమలగిరిలో ఉంది. సంస్థలో అజిత్ కుమార్ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం కస్టోడియన్లు రామకృష్ణ, అబ్దుల్ మాలిక్, సెక్యూరిటీ గార్డు పెరుమాల్‌లు.. అజిత్ నడిపే వ్యానులో డబ్బులతో బయలుదేరారు. అత్తాపూర్, కిస్మత్‌పూర్, అల్కాపూర్, మణికొండ ప్రాంతాల్లోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో నగదు డిపాజిట్ చేస్తూ.. సాయంత్రం 4.30కి గోపనపల్లికి వచ్చారు. కస్టోడియన్లు కొంత నగదుతో ఏటీఎంలోకి వెళ్లగా సెక్యూరిటీ గార్డు, డ్రైవర్ వ్యాన్ వద్ద ఉన్నారు. అదే సమయంలో సెక్యూరిటీ గార్డు బాత్ రూంకు వెళ్లగా, ఇదే అదనుగా డ్రైవర్ డబ్బుల వ్యాన్‌తో పారిపోయాడు. పోలీసులు జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా ఆరా తీయగా.. తెల్లాపూర్‌లో వ్యాన్ ఉన్నట్లు తేలింది.

## మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల దూకుడు

### జాతీయ బిసి మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్



హైదరాబాద్, ఫిబ్రవరి 12: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు చూపిన ప్రదర్శన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రిజర్వేషన్ అమలులో రాజకీయ పార్టీల వైఖరిపై బీసీ సమాజం ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైన సందేశం ఇచ్చిందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు. గురువారం కాచిగూడ లో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ వ్యవస్థలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంలో పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆ అసంతృప్తి ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో వ్యక్తమైందని తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు కలిపి 123 నగం పాలక సంస్థలలో 2,996 వార్డులకు పోలింగ్ జరిగింది. పార్టీలకు అతీతంగా అనేక మున్సిపాలిటీల్లో జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలకు ప్రజలు విశేష మద్దతు తెలిపారని రాజేందర్ పటేల్ వెల్లడించారు. 'బీసీ ఓటు బీసీలకే' అనే భావజాలం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బలంగా ప్రతిఫలించిందని చెప్పారు. ఇది కేవలం ఎన్నికల ఫలితం మాత్రమే కాదు, బీసీల సామాజిక ఆత్మగౌరవానికి సంకేతమని వ్యాఖ్యానించారు. బీసీల జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో కనీసం 50 శాతం ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు స్పష్టమైన విధానం ప్రకటించాలని రాజేందర్ పటేల్ డిమాండ్ చేశారు.



## వేములవాడ నిత్యాన్నదాన సత్రం గదుల నిర్మాణానికి రూ.1.5 లక్షల విరాళం

జగిత్యాల (వాయిస్ టుడే న్యూస్) : వేములవాడలోని శ్రీ రాజ రాజేశ్వరి మున్నూరు కాపు (కాపు) నిత్యాన్నదాన సత్రం నూతన గదుల నిర్మాణానికి జగిత్యాలకు చెందిన డాక్టర్ పూరేల్ల సురేష్--మనీష దంపతులు తమ వంతు సహకారంగా రూ.1,50,000 విరాళం అందించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ విరాళాన్ని అందజేసి నిర్మాణ పనులకు తోడ్పాటు అందించారు. ఈ సందర్భంగా దాత దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులకు శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని సత్రం వ్యవస్థాపకులు డా. కొండా దేవయ్య పటేల్ ఆకాంక్షించారు. సమాజ సేవలో భాగంగా చేసిన ఈ సేవను ఆయన అభినందించారు. కార్యక్రమంలో దీటి అంజయ్య పటేల్, తిరుపతి కర్రు, రమేష్ పటేల్ వంగల, ఎర్రం చందు, మర్రిపెల్లి సంతోష్ తదితరులు పాల్గొని దాతలను శుభాభినందనలు తెలియజేస్తూ సత్కరించారు.







## జనసేన నేత ప్రేమ్ కుమార్‌కు శుభాకాంక్షల వెల్లువ

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 12(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కెపిహెచ్బి కాలనీ 5వ ఫేస్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు స్వీకరించారు. జనసైనికులు, వీర మహిళలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కాలనీవాసులు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై శాలువాలు, పూలమాలలు, పూల బొకేలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ్ కుమార్ సేవా కార్యక్రమాలు, ప్రజల సమస్యలపై ఆయన చూపుతున్న చురుకుదనం, నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని పలువురు కొనియాడారు. "ప్రజలే నా బలం, వారి ఆశీర్వాదాలే నా ప్రేరణ" అని ప్రేమ్ కుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే ఫోన్ ద్వారా, ప్రత్యక్షంగా, పరోక్షంగా మరియు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ప్రేమ కుమార్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా మరింత సేవ చేయడానికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఈ వేడుకలు జనసేన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగా, కార్యాలయం పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.



# బ్రహ్మోత్సవాలకు కేతకి సంగమేశ్వర క్షేత్రం ముస్తాబు



ఝరాసంగం ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే) : తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి శైవ క్షేత్రాలలో ఒకటైన దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి వారి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి నవాహ్నిక బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు భక్తులు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు.

**స్థల పురాణం......**

ఝరాసంగం క్షేత్రంలో శివలింగాన్ని సాక్షాత్ బ్రహ్మదేవుడు ప్రతిష్టించినట్లు ఇక్కడి స్థల పురాణాల ద్వారా తెలుస్తుంది. కృతయుగంలో సూర్యవంశానికి చెందిన కుపేంద్ర అనే రాజు చర్మవ్యాధితో బాధపడుతూ ఉండేవాడు. తన వ్యాధి నివారణకు ప్రతిరోజు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఒకానొకప్పుడు రాజు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇక్కడున్న కేతకి వనంలో ఉన్న నీటి గుండంలో స్నానం చేశాడు. అతనికి పూర్తిగా స్వస్థత చేకూరిందంట రోజు రాత్రి రాజుకి సంగమేశ్వర స్వామి కలలో కనిపించి తానక్కడా ఉన్నానని శివలింగాన్ని వెలికి తీసి ఆలయాన్ని నిర్మించుకొని ఆదేశించాడంట. అక్కడున్న నీటి గుండాన్ని పుష్కరినిగా మార్చి దానికి అష్ట తీర్థమని, అమృత గుండంగా పేరు పెట్టినట్లు అక్కడి ఆధారాల ద్వారా అర్థమవుతుంది. గర్భాలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి వారి దివ్య మంగళ లింగ రూపాన్ని ధరించిన భక్తులకు అపురూపమైన ఆధ్యాత్మికానందానికి లోనవుతారు. మంజీర నది తీరంలో వెలసిన ఈ స్వామిని సంగమేశ్వర స్వామి అని పిలుస్తారు. కేతకి సంగమేశ్వర స్వామిగా పూజలు అందుకుంటున్న ఈ స్వామిని మొదట బ్రహ్మదేవుడు కేతకి పుష్పములతో (కేతకి అంటే మొగిలి పువ్వులతో పూజించుట అని శిలా శాసనాల ద్వారా తెలుస్తుంది.

**ప్రచారంలో మరో పురాణ గాధ.....**

స్థల పురాణానికి సంబంధించి మరో పురాణ గాధ ఒకటి ప్రచారంలో ఉంది. పూర్వం కేతకి అనే అప్సరస ఓ ముని శాపంతో కేతకి మొగిలి వనంగా మారిందట. దీంతో శాప విమోచనాన్ని కోరి ఆమె శివుని గురించి గోరతపస్సు చేయగా ఆమె భక్తి వెచ్చిన శివుడు అక్కడ బాలలింగ రూపంలో వెలిశాడట. ఆ కారణంగా ఆ స్వామి సంగమేశ్వర స్వామిగా పూజలు అందుకుంటున్నట్లు తెలుస్తుంది. అలాగే సృష్టి అనంతరం బ్రహ్మదేవుడు శివుడిని కేతకి పుష్పములతో ఆరాధించాడంట ఆ కారణంగా ఈ స్వామికి కేతకి సంగమేశ్వర స్వామి అనే పేరు వచ్చిందంటారు. ప్రధాన ఆలయానికి వెనక భాగంలో అమృతగుండం దర్శనమిస్తుంది. ఆ గుండంలో స్నానం చేసేవారి చర్మ రుక్మతలన్ని పోతాయని భక్తుల విశ్వాసం అలాగే కాశీలోని గంగా నదిలోని ఓ ఝరా ఇక్కడ నీటి గుండంలో అంతర్లీనంగా కలుస్తుందంటారు. ఆలయంలో ఏటా మహాశివరాత్రి ఉత్సవాలకు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. వేలాదిమంది భక్తులు పాల్గొనే ఈ శోభను స్వయంగా చూడలే కానీ వర్ణించే శక్యం కాదు.

**కార్యక్రమాల వివరాలు.....**

12 వ తేదీన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రికి పల్లకి సేవ, భజనలు

13 వ తేదీన స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన రాత్రికి భజన

14 వ తేదీన స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, సాయంత్రం 5-00 గంటలకు శేష వాహన సేవ, గ్రామ ఊరేగింపు, రాత్రికి పల్లకి సేవ,భజనలు

15 వ తేదీన మహాశివరాత్రి, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమము, స్వామివారికి అభిషేకము, రాత్రి లింగోద్భవ సమయమున మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, ఋత్విక్కరణ, పల్లకి సేవ,భజనలు

16 వ తేదీన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రస్వాకార హోమము, నవగ్రహ శాంతి హోమం, సాయంత్రం 5-00 గంటలకు నంది వాహన సేవ, రాత్రి 12 గంటలకు అగ్నిగుండము పూజ, అగ్ని ప్రతిష్ఠ.

17 వ తేదీన ఉదయం 4 గంటల 30 నిమిషాలకు అగ్నిగుండం, స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్ర స్వాహకార హోమము, పూర్ణాహుతి సాయంత్రం 5 గంటలకు, శ్రీ పార్వతీ సంగమేశ్వర స్వామి కళ్యాణోత్సవం, రాత్రి 10 గంటల 30 నిమిషాలకు స్వామివారి విమాన రథోత్సవం,

18వ తేదీన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పల్లకి సేవ భజనలు

19 వ తేదీన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, లక్ష బిల్వార్చన,పల్లకి సేవ అన్నదానం

కేతకి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు,త్రాగునీరు,చలువ పందిళ్లు, అమృత గుండంలో స్నానాలు ఆచరణ చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం జాతర సందర్భంగా జహీరాబాద్ నుండి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు. శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామన్నారు. భక్తులకు అందుబాటులో లడ్డు, పులిహోర ప్రసాదాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీసుల సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామన్నారు.



**– ఆలయ కార్యనిర్వాణాధికారి శివ రుద్రప్ప..**



శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు,త్రాగునీరు, ఆవరణలోని అమృత గుండంలో స్థానాలు చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, భక్తుల సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయ వంతం చేస్తామన్నారు.

**– కేతకి ఆలయ చైర్మన్ చంద్రశేఖర్**






## ఎల్ ఓసి లను మంజూరు చేపించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా;ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా కు చెందిన దిగవత్ వినోద్ అనారోగ్య సమస్య ల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి 2,00,000 ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు డబ్బులను మంజూరు చేపించారు.. కాగ ఎల్ఓసి మంజూరు చేపించడం పట్ల బాధిత కుటుంబ సభ్యుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఓట్ల లెక్కింపుకు పటిష్ట బందోబస్తు

**– విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేధం**

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



వేములవాడ, ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే) : మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా సిరిసిల్ల, వేములవాడలలో ఏర్పాటు చేసిన కౌటింగ్ కేంద్రాల వద్ద 250 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. మున్సిపల్ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత నిర్వహిస్తున్నామని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా163 బిఎన్ఎస్ఎస్,144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎంసిసి అమలులో ఉందని ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం,గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు,సభలు, బైక్ ర్యాలీలు నిర్వహించడం, డీజే కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, టపాకాయలు కాల్చడం, భారీగా గుంపులు, గుంపులుగా గుమి కూడటం, ఫంక్షన్ హాల్స్‌లో సమావేశాలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధం అన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటాని జిల్లా ఎస్పీ తెలిపారు.

# పంజా విసురుతున్న చిరుత

**రోజుకో గ్రామంలో సంచరిస్తూ వరుస దాడులు**

**మర్తనపేటలో మరోసారి మేకల మందపై దాడి**

**బెంబేలెత్తుతున్న స్థానికులు, పట్టించుకోని అధికారులు**

కోనరావుపేట, ఫిబ్రవరి 12 ( వాయిస్ టుడే): గ్రామాల్లో చిరుతపులి వరుసగా సంచరిస్తూ పంజా విసురుతోంది. అటవీ ప్రాంతంలోనే ఆవాసం ఏర్పాటు చేసుకుని అటు వైపువెళ్తున్న మేకల మందపై దాడులు చేస్తూ హడలెత్తిస్తుంది. మంగళవారం మండలంలోని మర్తనపేటలో రెండు రోజులుగా మేకల మందపై దాడులు చేయడంతో గ్రామస్థులు బెంబేలెత్తుతున్నారు. మూడు రోజుల క్రితం మరిమడ్ల గ్రామంలో డోరపందిపై దాడి చేసిన ఘటన మరువకముందే మర్తనపేటలో చిరుత వరుసగా దాడి చేయడం కలకలం రేపుతుంది. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న గ్రామంలోనే చిరుతపులి సంచరిస్తూ మేకల మందపై దాడులు చేస్తున్న దానిని పట్టుకోవడానికి అటవీశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ శివారులోని చింతగుండు చెరువు ప్రాంతంలో ఆవాసంగా ఏర్పాటు చేసుకుని చిరుత ,ఏగుర్ల రమేష్, ఏస కనకయ్య మేకల మందపై దాడి చేసి, రెండు మేకలను హతమార్చింది. దీంతో మేకలను మేపేందుకు గ్రామశివారులో వెళ్లేందుకు కాపారులు జంకుతున్నారు. ఇకనైనా ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి చిరుత భారీ నుంచి మేకల కాపారులతో పాటు స్థానికులను రక్షించాలని కోరుతున్నారు.



# కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

**ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే) : మున్సిపల్ ఎన్నికల నేపథ్యం లో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ర్యాండమైజెషన్ ప్రక్రియ గురువారం పూర్తి చేశారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**– ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం**

**– ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు**

**– జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్‌లి**

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి12 (వాయిస్ టుడే): సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల సినారె కళామందిరంలో మాక్ కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం చేయగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్, జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. వేములవాడ సినారె కళామందిరంలో మాక్ కౌంటింగ్ ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో సినారె కళామందిరాల్లో కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచామని, ఇప్పటికే ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి ఏర్పాట్లు పరిశీలించామని వివరించారు. ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారని వివరించారు. ఒక్కో వార్డుకు ఒక టేబుల్ చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక్కో టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, మూడు టేబుల్ లకు కలిపి ఒక ఆర్ఓ, ఏఆర్ఓ ఉంటారని వెల్లడించారు. సిరిసిల్లలో మొత్తం 39 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 78 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. వేములవాడ లో మొత్తం 28 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 56 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణకు గెజిటెడ్ అధికారులను నియమించామని పేర్కొన్నారు.

# ఉపాధి హామీ పనులు ప్రారంభం

**పాల్గొన్న సర్పంచ్ తిరుపతి నాయక్, ఉప సర్పంచ్ శ్రీనివాస్**



కొనరావుపేట ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండల పరిధిలోని గోవిందరావుపేట తండాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ తిరుపతి నాయక్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ మరియు కలిసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామస్తులకు, కూలీలకు చేతినిండా పని కల్పించి వారి జీవనోపాధిని మెరుగుపరచడమే పంచాయతీ లక్ష్యమని తెలిపారు. పని ప్రదేశంలో కూలీలకు కావాల్సిన మంచినీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ మాట్లాడుతూ, కూలీలు ప్రతిరోజూ ఉదయాన్నే పని ప్రదేశానికి చేరుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి పూర్తి వేతనం పొందాలని సూచించారు. మస్టర్ రోల్స్ నిర్వహణ మరియు పనుల పర్యవేక్షణలో కూలీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు, వార్డు సభ్యులు మరియు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రతి గర్భిణీకి టీఫా తప్పనిసరి**

**మాతా శిశు కేంద్రంలో మరిన్ని పడకలు: కలెక్టర్ పమేలా సత్పతి**



కరీంనగర్,ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే):సాధారణ ప్రసవాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తప్పనిసరి అయితేనే సిజేరియన్ చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వైద్య బృందానికి సూచించారు. కరీంనగర్ మాత శిశు సంరక్షణ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు.గర్భిణీలు, పిల్లల వార్డును సందర్శించి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశ మందిరంలో గైనకాలజిస్టులు, అనస్తీసియా,పిల్లల వైద్యులు, రేడియాలజిస్టులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కువ సంఖ్యలో సాధారణ ప్రసవాలు జరగడం విశేషమని అన్నారు. ఆదిలాబాద్ తర్వాత జిల్లాలోని పిహెచ్సిల్లో ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు.మాత శిశు సంరక్షణ కేంద్రంలో డెలివరీల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు.అయితే సాధ్యమైన మేర సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.గర్భిణికి ముందు నుంచే సాధారణ ప్రసవం ఆవశ్యకతను ఏఎన్ఎం,ఆశా వర్కర్ల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. శుక్రవారం సభలకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది హాజరై సాధారణ ప్రసవం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.ప్రతి గర్భిణీకి టీఫా స్కాన్ తప్పనిసరి అని తెలిపారు.మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మరొక టీఫా మిషన్ తెప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు కేంద్రంలో అవసరమైన వైద్య పరికరాల జాబితా సమర్పించాలని, వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మరిన్ని పడకలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ,ఆర్ఎంవో నవీనా,ప్రోగ్రాం అధికారి సనా, వివిధ విభాగాలకు చెందిన వైద్యాధికారులు పాల్గొన్నారు.



## స్తంభంపల్లి గ్రామంలో వ్యవసాయానికి సంబంధించి సామాజిక వనరుల మ్యాప్

బోయినపల్లి ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే ప్రతినిధి) : బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక అంశంపై సదస్సు జరిగింది. ప్రోపేషర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థిణిల కె. అనూషా నాయక్, తనజ్జా మహీన్, బి. సుష్మిత, జె.కావ్య ఆధ్వర్యంలో గ్రామ సమస్యల గుర్తింపు, పరిష్కారం పై ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయానికి సంబంధించిన సామాజిక వనరుల మ్యాప్, టైమ్ లైన్, బార్ చార్ట్, చపాతి పటం గీసి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, మాజి ఎంపిటిసి అక్కనపల్లి ఉపేందర్, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, వార్డు సభ్యులు చంద్రగిరి వెంకటేష్, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, గంద్ర నర్సింగరావు, బుర్ర రాజయెల్లయ్య ,పులి శేఖర్ పాఠశాల ఉపాధ్యాయులు మరియు అంగన్వాడీ , ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే) రాజన్న సిరిసిల్ల జిల్లా లో మహా శివరాత్రి జాతర సందర్భం గా వేములవాడ లో చేస్తున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురు వారం పరిశీలించారు. పార్కింగ్ ఏరియా, క్యూ లైన్లు, పారిశుధ్య పనులు, ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఈ పరిశీలనలో డీఆర్డీఓ గీత, ఆర్ అండ్ బీ ఈఈ నర సింహా చారి, డీఈ శాంతయ్య, ఆలయ ఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## దేశవ్యాప్త సమ్మె మెట్ పల్లిలో అంగన్వాడీల భారీ ర్యాలీ..

మెట్‌పల్లి వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.ఫిబ్రవరి 12: 4 లేబర్ కోడ్ ల రద్దుకై వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెట్పల్లిలో జిల్లాలోని అన్ని మండలాల అంగన్వాడి టీచర్స్,ఆయాలు వ్యవసాయ మార్కెట్లో సమావేశమై ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు బస్సు డిపో నుండి ఆర్డిఓ ఆఫీస్ వరకు వెళ్లి ఆర్డిఓ శ్రీనివాస్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం అంగన్వాడీ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం సాయిస్వరి మాట్లాడుతూ.... అంగన్వాడి టీచర్ ఆయాలను ప్రభుత్వ టీచర్లగా గుర్తించి కనీస వేతనం 26000 చెల్లించాలి అలాగే పదవి విరమణ పొందిన టీచర్లకు ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలి పెరిగిన ధరలకు అనుకూలంగా ఆరోగ్యలక్ష్మి మెనూ చార్జీలు పెంచి హెల్త్ కార్డులు పిఎఫ్,గ్రాడ్యుటి వర్తింపజేయాలి అర్హులైన అంగన్వాడి టీచర్లకు సూపర్వైజర్ పదోన్నతి కల్పించాలని వివిధ డిమాండ్లు మాట్లాడారు... ఇంకా ఏఐటీయూసీ జిల్లా నాయకులు సుతారి రాములు,ఎండి ఉస్మాన్ లు మాట్లాడుతూ.... కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి కార్మిక వర్గం పోరాటాలను అనచివేస్తుంది సుప్రీంకోర్టు ఏదైతే తీర్పునిచ్చిందో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి కోరుట్ల జగిత్యాల మేడిపల్లి ఇబ్రహీంపట్నం మల్లాపూర్ మండలాల అంగన్వాడి టీచర్స్ ఎం భాగ్యలక్ష్మి, దయావతి,శారద, వనిత,పద్మ,మమత,సునీత, హిమగిరి, షమీం సుల్తానా,లక్ష్మి అలాగే మధ్యాహ్న భోజన, గ్రామపంచాయతీ, మున్సిపల్ తదితర కార్మికులు పాల్గొన్నారు.





# మెజారిటీ స్థానాలు బీజేపీకే రాబోతున్నయ్

**కాంగ్రెస్ ప్రలోభాలకు తెరదీసింది**

**దేశమంతా కరీంనగర్ వైపు చూస్తోంది**

**కౌంటింగ్ వద్ద అప్రమత్తంగా ఉండండి**

**చిన్న పొరపాటు చేసినా నష్టపోతాం జాగ్రత్త**

**కార్పొరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో కేంద్ర మంత్రి సమావేశం**

**గెలిస్తే అందరం కలిసి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లి అంజన్నను దర్శించుకోవాలనే యోచన**

కరీంనగర్, ఫిబ్రవరి 12(వాయిస్ టుడే):కార్పోషన్ ఫలితాల్లో మెజారిటీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకోబోతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. యావత్ దేశమంతా కరీంనగర్ ఫలితాలవైపు చూస్తోందన్నారు. బీజేపీకి అనుకూల ఫలితాలు రాబోతున్నాయని,కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించబోతున్నారని చెప్పారు. కరీంనగర్ లోని రాజశ్రీ గార్డెన్ లో బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు.బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ,మాజీ మేయర్ సునీల్ రావు,మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్,పార్టీ సీనియర్ నేతలు వాసాల రమేశ్,సాయిని మల్లేశం,గుజ్జ శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్ లో బీజేపీకి మెజారిటీ స్థానాలు రాబోతుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైంది.ప్రలోభాలకు గురిచేసి బీజేపీ కార్పొరేటర్లను గుంజాలని చూస్తోంది. అప్పుడే కాంగ్రెస్ నేతలు ఫోన్లు చేస్తూ ప్రలోభాల స్కెచ్ కు తెరదీశారు.జాగ్రత్తగా ఉండండి.అని సూచించారు.పార్టీని మోసం చేస్తే కన్నతల్లిని మోసం చేసినట్లేనని చెప్పిన బండి సంజయ్ అధికార పార్టీ ఆశలకు లోబడి ఎవరైనా కాంగ్రెస్ లోకి వెళితే తీవ్రమైన పరిణామాలుంటాయనీ,కార్యకర్తల ఆవేశాన్ని తట్టుకోవడం అసాధ్యం అని హెచ్చరించారు. ఫలితాల సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అభ్యర్థుల తరపున ఏజెంట్లు ఏం చేయాలనే అంశంపై మాజీ మేయర్ సునీల్ రావు వివరించారు.కౌంటింగ్ ఏజెంట్ల దృష్టి అంతా బ్యాలెట్ పేపర్ మీదే ఉండాలని చెప్పారు.చర్చల పేరుతో,గొడవల పేరుతో దృష్టి మళ్లించేందుకు ప్రత్యర్థులు ప్లాన్ చేసే అవకాశముందని,వాటికి తావివ్వకుండా బ్యాలెట్ పైనే ద్రుష్టి పెట్టాలన్నారు.ముఖ్యంగా కౌంటింగ్ కేంద్రంలో ఎవ్వరితోనూ గొడవ పడొద్దని, ఏదైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా రాసి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలని చెప్పారు.ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్క సీటు పార్టీకి అత్యంత ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి క్షణం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ అభ్యర్థులంతా బండి సంజయ్‌కు ధన్యవాదాలు తెలిపారు.ఈ ఎన్నికల్లో మాకు టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా మా గెలుపు కోసం మీరు పడ్డ కష్టాన్ని మరువలేం.ఈ ఎన్నికల్లో మీ కష్టం మీరందించిన సాయం మీరందించిన సహకారం ఎనలేనిది అని బండి సంజయ్ కు ధన్యవాదాలు చెప్పారు.ఎన్నికల్లో గెలిస్తే కరీంనగర్ నుండి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుంటే బాగుంటుందని సూచన రాగా సమావేశానికి హాజరైన కార్పొరేటర్ అభ్యర్థులంతా అందరం కలిసే పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుందామని చేతులెత్తి సమ్మతిని తెలియజేశారు.



## రాజన్న మహాశివరాత్రి జాతర సందర్భంగా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

**జాతర సందర్భంగా వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే): మహాశివరాత్రి జాతర సందర్భంగా భద్రతా ఏర్పాట్ల పై జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు స్వామి వారి దర్శనం సులభంగా, ప్రశాంతంగా జరిగేలా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈనెల 14, 15, 16 తేదీల్లో జరుగు మహా శివరాత్రి జాతరను విజయవంతం చేయడానికి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భీమేశ్వర ఆలయంతో పాటు, బడిపోచమ్మ ఆలయం, నాంపెల్లి ఆలయం, అగ్రహారం ఆలయల వద్ద భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని తెలిపారు. జాతరకు భారీగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ నిఘా వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు, తప్పిపోయిన వారికోసం సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర ప్రాంగణంలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై నిఘా పెంచాలని, ప్రజలకు సూచనలు చేస్తూ లౌడ్‌స్పీకర్ల ద్వారా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం ఫైర్, మెడికల్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జాతర బందోబస్తు విధుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుండి వచ్చే పోలీస్ అధికారులు, సిబ్బందికి తగిన వసతి సౌకర్యాలు కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విధులు నిర్వర్తించే సిబ్బందికి విశ్రాంతి తీసుకునేందుకు అనుకూలమైన వసతి గృహాలు, తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు, భోజన ఏర్పాట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతర సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన వాతావరణంలో దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్ లు వీరప్రసాద్, కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధుకర్, రవి, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు మద్దతుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల ధర్నా

**ప్రజా రంగ బ్యాంకుల బలోపేతం డిమాండ్**



కరీంనగర్,ఫిబ్రవరి 12(వాయిస్ టుడే):దేశవ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు కరీంనగర్‌లోని రీజియన్ ఆఫీస్ ముందు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మేనేజర్లు, క్యాషియర్లు, ఆఫీసర్లు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు.ఈ ధర్నా కార్యక్రమంలో రీజినల్ సెక్రటరీ రమేష్,యూనియన్ నాయకులు తిరుపతి,మెరుగు ప్రవీణ్,శేఖర్, బాలకిషన్, రమణారెడ్డి,అశోక్, సాయి,అహ్మద్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ రంగ బలోపేతం,ఖాళీ పోస్టుల భర్తీ, ఔట్‌సోర్సింగ్ విధానాల నిలిపివేత, ఎన్పిఎస్ రద్దు ఓపిఎస్ పునరుద్ధరణ, ఉద్యోగుల సంక్షేమం పెంపు వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు.ప్రజా రంగ బ్యాంకులు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజా సేవలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నామని నాయకులు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు నినాదాలు చేస్తూ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.

## మహా శివరాత్రి వేడుకలకు ఏ ఏం సి చైర్మన్ ఎల్లేష్ యాదవ్ ను ఆహ్వానించిన సర్పంచ్ కనుకయ్య



బోయినపల్లి ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే ప్రతినిధి) : బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోనీ శ్రీ శ్రీ శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి ఆలయం లో ఈ నెల 15 నుండి మూడు రోజుల పాటు జరిగే శివరాత్రి వేడుకలకు బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ను సర్పంచ్ ఏనుగుల కనుకయ్య ఆహ్వానించారు.మండలంలోని 23 గ్రామాల సర్పంచ్‌లను కూడా ఆహ్వానించనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

# 4 లేబర్ కోడ్‌ల రద్దు కోసం వామపక్షాల ప్రజా సంఘాల ఆందోళన

**ఏఐటీయూ న్యూ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి దశరథం**

**బిజెపిపై తీవ్ర విమర్శలు**



రాజన్న సిరిసిల్ల జిల్లా; ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే): కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యం లో గురువారం రోజున దేశావ్యాప్త సార్వాత్రిక సమ్మె లో భాగంగా సిరిసిల్ల =ఖా కి విజ్ఞాపనా పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 4 లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, అందరికి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతినెల వేతనాలు చెల్లించాలని, రైతు వ్యతిరేక విధానాలు ఉపసంహారించుకోవాలని, ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని, ఉపాది హామీని పట్టణాలకు విస్తరించి, సంవత్సరశీ లో 200 రోజుల పని దినాలు కల్పిస్తూ, రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని, పవర్ లూం కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన GO ప్రకారం 10 గంటల పని, వారంలో 48 గంటలు కల్పిస్తూ, నైట్ డ్యూటీ రద్దు చేయాలని, వర్క్ టూ ఓనర్ పథకం వెంటనే అమలు చేయాలని, త్రిఫ్ట్ స్కీమ్ అమలు చేయాలని, 50 సంవత్సరాల కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికులకు సైతం 55 సంవత్సరాలు నిండిన వారికి 5వేల పెన్షన్ ఇవ్వాలని, అంగన్వాడీ లను రెగ్యులరైజ్ చేయాలని, సివిల్ సప్లై కార్మికులను 4 వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, హమాలి కార్మికులకు పని భద్రత, దేవస్థానం, మిషన్ భగీరథ వారిని రెగ్యులరైజ్ చేయాలని, ఆటో కార్మికులకు ప్రభుత్వం చెప్పిన విదంగా జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని తదితర విజ్ఞాపణలు చేశారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, పోచయ్య, వడ్డెపెల్లి లక్ష్మన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ, జువ్వాజీ విమల, IFTU నాయకులు ఆకుల రాములు,తదితర నాయకులు పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రసంగం 'విజన్ 2047'కు మార్గదర్శకం

## - అసెంబ్లీలో ఎమ్మెల్యేయార్లగడ్డ వెంకట్రావ్



కృష్ణా జిల్లా-గన్నవరం(వాయిస్ టుడే): అసెంబ్లీ లో రెండో రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ అసెంబ్లీలో కీలక ప్రసంగం చేశారు. గవర్నర్ ప్రసంగం కేవలం ఒక ప్రకటన కాదని, అది 'విజన్ 2047' దిశగా రాష్ట్రం సాగాల్సిన స్పష్టమైన మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో నెలకొన్న అంధకారం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తూ, కేవలం 20 నెలల్లోనే రూ.4,498 కోట్ల విద్యుత్ బకాయిలను చెల్లించడంతో పాటు విద్యుత్ ఛార్జీలను తగ్గించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రానికి 13.25 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 16 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా అడుగులు పడుతున్నాయని వివరించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి వంటి మూడు ప్రధాన అభివృద్ధి కారిడార్ల ద్వారా రాష్ట్ర ప్రగతిని పరుగులు తీయిస్తున్నామని, అమరావతిని శాశ్వత రాజధానిగా పునరుద్ధరించడమే కాకుండా పోలవరం పనులను వేగవంతం చేశామని గుర్తుచేశారు. పారిశ్రామిక రంగంలో 8.74 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, అలాగే ప్రతి నియోజకవర్గంలో మీవీజు పార్కుల ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, క్వాంటం వ్యాలీ, AI మరియు డ్రోన్ స్కిల్ సెంటర్ల ఏర్పాటు భవిష్యత్తు అవసరాలకు నిదర్శనమని వెంకట్రావ్ కొనియాడారు. గతంలో వివాదాస్పదమైన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భరోసా కల్పించామని, శాంతిభద్రతల పరిరక్షణ ద్వారా పెట్టుబడిదారులలో నమ్మకాన్ని పెంచామని ఆయన చెప్పారు. మొత్తానికి ఈ ప్రభుత్వం సంక్షేమంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఆయన తన ప్రసంగంలో స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలోని అనిశ్చితికి తెరదించుతూ, ప్రస్తుత ప్రభుత్వం స్థిరత్వం మరియు అభివృద్ధి లక్ష్యంగా అడుగులు వేస్తోందని గత ప్రభుత్వ హయాంలో ఆడంబరపు ప్రకటనలు తప్ప, ఆచరణలో లోపాలు స్పష్టంగా కనిపించేవని విమర్శించారు. ముఖ్యంగా ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందక ఇబ్బంది పడటం, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి ఉపాధ్యాయులను బోధనేతర పనులకు పరిమితం చేయడం వంటి చర్యలు రాష్ట్ర ప్రగతిని కుంటుపరిచాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన 18 మెడికల్ కాలేజీలు నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోగా, అభివృద్ధి పనుల కంటే సలహాదారుల వ్యవస్థకే వందల కోట్లు ఖర్చు చేయడం విమర్శలకు దారితీసిందని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు విషయంలో జరిగిన జాప్యం వల్ల ప్రాజెక్టు వ్యయం రెట్టింపు అయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఆలస్యమైతే అయ్యే నష్టాన్ని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి గుర్తించకపోవడం రాష్ట్రానికి తీరని లోటుగా మారిందన్నారు. అయితే, నేడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత, అమలులో వేగం కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. ప్రజల అవసరాలకు తగ్గట్లుగా అభివృద్ధి, ఉపాధి కల్పన మరియు బాధ్యతాయుతమైన పాలనను అందిస్తూ ప్రజల్లో కోల్పోయిన నమ్మకాన్ని ఈ ప్రభుత్వం తిరిగి సంపాదిస్తోందన్నారు. ప్రస్తుత బడ్జెట్ సైతం ఇదే అభివృద్ధి దిశగా రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని ఎమ్మెల్యే యార్లగడ్డ పేర్కొన్నారు.




## కార్పొరేట్‌లకు దాసోహమైన మోడీ ప్రభుత్వం

## భైంసాలో సార్వత్రిక సమ్మె

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 12 : కార్మిక, రైతు, ప్రజలను కార్పొరేట్ లకు దోచిపెట్టడం మానుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏ ఐ కె ఎం స్) రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.రాజు,, టి యు సి ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏం బక్కన్న రామ్ లక్ష్మణ్ ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి ఎం హరిత ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు ఇప్ప లక్ష్మణ్ హెచ్చరించారు. గురువారం సంయుక్త కిసాన్ మోర్చా, సి టి యు ల ఆధ్వర్యంలో భైంసా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సార్వత్రిక సమ్మె సభలో వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేకంగా చట్టాలు రూపొందిస్తున్నదని అనేక సంవత్సరాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తెస్తున్నదని విమర్శించారు కార్మికుల జీతభత్యాలు తక్కువగా ఉండి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న ప్రస్తుత పరిస్థితిలో కోడ్ ల రూపంలో దోపిడీ పెంచుతున్నారని విమర్శించారు వ్యవసాయ రంగాన్ని వ్యాపారాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పే కుట్రలో భాగంగా విత్తన చట్టం విద్యుత్ చట్టం తెస్తున్నదని అన్నారు అమెరికా తో చేసుకున్న ఒప్పందాలు భారత చిన్న సన్న కారు రైతాంగ వెన్ను విరుస్తాయని ఇది మోడీ తన ఫ్రెండు అయినా ట్రంప్ కు ఇస్తున్న బహుమతి అని విమర్శించారు వ్యవసాయ వాణిజ్యాన్ని బహుళ జాతి కంపెనీలకు ప్రవేశం కల్పిస్తూ రైతులను వ్యాపారులకు బలి పశువులుగా మారుస్తున్నారని అన్నారు కార్మిక కర్షక లోకం ఏకమై మోడీ ప్రభుత్వం పై పోరాటాన్ని కొనసాగిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు మహేందర్ మద్దతు తెలిపారు ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐ కేఎంఎస్ జిల్లా నాయకులు గంగాధర్ దీనాజీ ఏఐకేఎస్ నాయకులు ము త్తన్న, టి యూ సి ఐ నాయకులు గోదావరి, ఏఐటీయూసీ నాయకులు కార్మికులు దేవిదాస్, రాములు, శంకర్, అనురాధ, నరేష్, నరేందర్, మధుకర్, గంగాధర్, రమేష్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

### ఐ యన్ టి యూ సి మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు సామ వెంకన్న డిమాండ్




మిర్యాలగూడ ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే): దేశంలో అమలు చేస్తున్నటువంటి, 12 గంటల పని దినాలను, రద్దు చేయాలి అని ఐఎన్టియుసి మిర్యాలగూడ నియోజకవర్గం అధ్యక్షులు సామ వెంకన్న కేంద్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడుగురు కార్మికులు ఉన్న యూనియన్ పెట్టుకునే విధానాన్ని ఆమలులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారతదేశంలో ఉన్నటువంటి, కార్మికులపై, నరేంద్ర మోడీ అవలంబిస్తున్నటువంటి, వ్యతిరేకిస్తూ, ఖండిస్తూ, ఈ యొక్క దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను, జయప్రదం చేసినటువంటి, అన్ని కార్మిక సంఘాలకు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నేడే పురపాలక ఫలితాలు




రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలో పురపాలక సంఘం ఎన్నికల ఫలితాలు నేడు ఓట్ల లెక్కింపు తో విడుదల కానున్నాయి. రాయికల్ మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తమదే గెలుపు అంటూ ఎవరికి వారు చెప్పుకుంటున్నారు. నేటికి ఎన్నికల ఫలితాలతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. గెలిచిన అభ్యర్థులు మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని అలాగే ఓడిన అభ్యర్థులు ప్రతిపక్షంగా ఉంటూ సమస్యలపై పోరాటం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని టియుసిఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ కార్మికప్రదర్శన

### కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఉపసంహరించుకోవాలి

### ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ)రాష్ట్ర ఉపాధ్యక్షులుకే రాజన్న




నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 12 : నిర్మల్ జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను కార్మిక వర్గానికి మరణశాసనం లాంటిదిఅని తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో టి యు సి ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ భవన్లో సదస్సు ఏర్పాటుచేసి, మంచిర్యాల్ చౌరస్తా వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా టి యు సి ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రాజన్న మాట్లాడు తూ కాంటాక్ట్ వర్కర్స్ పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని వారికి 26వేల రూపాయలు ఇవ్వాలని ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు వర్కర్స్ కార్మికులను రెగ్యులేషన్ చేయాలని ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని, కార్మికులకు భద్రత సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని కార్మికుల్ని నిరాయుధులను చేసి పెట్టుబడుదారులు పారిశ్రామికవేతలకు కార్పొరేట్లకు బంగారు పళ్లెములు పెట్టి బహుమాన ఇచ్చేందుకు సిద్ధమన్న సిద్ధమైందని వారు తెలిపారు. పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడానితీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా కోశాధికారి ఎండి గఫూర్. పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కట్ట లక్ష్మి. టి యు సి ఐ జిల్లా నాయకులు గంగామణి .భూషణ్ .గంగన్న. రాజేందర్. ఫెరోజ్. లక్ష్మి. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పద్మ కుమారి .ఎస్ఎన్ రెడ్డి. భుఖ్య రమేష్. సంజీవ్. తదితరులు పాల్గొన్నారు.

## కేసరపల్లికి కస్టమ్స్ కార్యాలయం

### ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చొరవ



కృష్ణా జిల్లా-గన్నవరం: గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషితో కేసరపల్లిలో కస్టమ్స్ కార్యాలయాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్, సెంట్రల్ ఎక్సైజ్ మరియు సర్వీస్ టాక్స్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు వీలుగా ప్రభుత్వం 3.84 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కేసరపల్లిలోని సర్వే నంబర్ 29/8లో ఈ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం బుధవారం జరిగిన సమావేశంలో ఆమోదముద్ర వేసింది. ఇక్కడ కేవలం కార్యాలయ భవన సముదాయమే కాకుండా, అధికారులు మరియు సిబ్బంది కోసం నివాస గృహాలను కూడా నిర్మించనున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చేలా చేయడంతో, త్వరలోనే ఈ కార్యాలయాలన్నీ కేసరపల్లిలో కొలువుదీరనున్నాయి.



## ప్రజా సంక్షేమమే లక్ష్యం

### ముధోల్ మండలంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శ్రీకారం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 12: ముధోల్ మండలంలోని 1కోటి 37 లక్షల నిధులతో పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ఈరోజు భూమి పూజ నిర్వహించారు. మండలంలోని రామ్‌టెక్ గ్రామంలో వీవో బిల్డింగ్ మరియు సీసీ రోడ్డు నిర్మాణానికి, మచ్కల్ గ్రామంలో వీవో బిల్డింగ్, సీసీ రోడ్డు నిర్మాణానికి, ముద్గల్ గ్రామంలో వీవో బిల్డింగ్ మరియు సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అలాగే సరస్వతి నగర్ గ్రామంలో అంగన్‌వాడి భవనం మరియు సీసీ రోడ్డు నిర్మాణానికి, బోరేగాం గ్రామంలో వీవో బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అదేవిధంగా చింతకుంట గ్రామంలో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి, చింతకుంట తండాలో అంగన్‌వాడి భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ గ్రామంలో వీవో భవన నిర్మాణానికి కూడా భూమి పూజ కార్యక్రమం చేపట్టారు.ఈ అభివృద్ధి పనులతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడి ప్రజలకు ఉపయోగం చేకూరుతుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు.



## కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత జిల్లా ఎస్పీ

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 12 : మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు కౌంటింగ్ పక్రియను ప్రశాంతంగా ప్రదర్శనంగా నిర్వహించేందుకు అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతంలో ఏర్పాటుచేసిన పార్కింగ్ భారీ కేడింగ్ ప్రతినిధులు అధికారులు సిబ్బంది ప్రవేశంపై పాటించాల్సిన నియమ నిబంధనలు తెలిపారు

## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ దివ్య క్షేత్రంలో హీరో రాజేంద్రప్రసాద్ ప్రత్యేక పూజలు

చేవెళ్ల...ఫిబ్రవరి 12(వాయిస్ టుడే)కేంద్ర ప్రభుత్వం హీరో డా. రాజేంద్రప్రసాద్ కు పద్మశ్రీ అవార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ స్వామి ఆహ్వానం మేరకు గురువారం శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో అష్టమ మోక్షపురిగా ప్రసిద్ధి చెందుతున్న చాళుక్య రాజుల కాలానికి చెందిన 11వ శతాబ్దపు మహిమగల బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర దివ్య క్షేత్రంలో టాలీవుడ్ సీనియర్ నటుడు, రాజేంద్రప్రసాద్ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి క్షేత్రపాలకుడు కాలభైరవుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సాయిశివ, ప్రమోద్, వీరేష్ లు హీరోకు తీర్థప్రసాదాలు ,కమిటీ సభ్యులు హీరోను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. హీరో మాట్లాడుతూ పురాతన మరకత లింగాన్ని దర్శించుకోవడం ఎంతో ప్రశాంతతను ఇచ్చిందని, మరల కుటుంబ సభ్యులతో శివాలయానికి వస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వీడియో రావు, ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, గౌరవ అధ్యక్షుడు సదానందం గౌడ్, డబ్బింగ్ ఆర్టిస్ట్ రైటర్ కృష్ణవేణి, కమిటీ సభ్యులు గోపాల్, హన్మంతు, గ్రామ సర్పంచ్ మల్లికార్జున్, ఉప సర్పంచ్ నర్సింలు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.



వాయిస్ టుడే

హైదరాబాద్
శుక్రవారం 13 ఫిబ్రవరి 2026



## వేములవాడ రాజన్నకు పాదయాత్ర చేపట్టిన నారాయణ పూర్ మహిళలు

ఎల్లారెడ్డిపేట/రాజన్న సిరిసిల్ల (వాయిస్ టుడే ప్రతినిధి) : ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన పలువురు మహిళలు వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొనుటకు గ్రామం నుండి పాదయాత్ర చేశారు. మహాశివరాత్రి నీ పురస్కరించుకొని 20 మంది మహిళ లు గ్రామ శివాలయం నుండి 30 కిలోమీటర్లలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్రగా తరలివెళ్లి స్వామి వారిని దర్శించుకోనున్నట్లు పాదయాత్రను చేపట్టినట్లు మహిళా భక్తులు తెలిపారు. చేపట్టడం జరిగిందన్నారు. మహిళలు చేపట్టిన పాదయాత్రను గ్రామ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, ఉపసర్పంచ్ మోతే మధుసూదన్ రెడ్డి లు ప్రారంభించి వారికిశుభాకాంక్షలు తెలిపారు.



## ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రారంబోత్సవం

రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలో మహోన్నతమైన శివాలయంలో సదుల సంతోష్ –సువర్ణ దంపతులు ప్రదర్శిత ద్వాదశ జ్యోతిర్లింగాలు నిర్మాణం చేయాగ తహసీల్దార్ మొదటి లింగాన్ని ఆవిష్కకరణం చేసి అభిషేకించి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం మండల అభివృద్ధి అధికారి ,చిరంజీవి సబ్ ఇన్స్ పేక్టర్ సుదీర్ రావు ,ఆర్ ఐ దాసరిపద్మయ్య మరియు వారి కుటుంబ సభ్యులు స్నేహితులు మిగత లింగేశ్వర ప్రతిమలను ప్రారంభించారు, తాహాసిల్దార్ నాగర్జున మాట్లాడుతు శివాలయం కు భక్తితో ఆర్థిక వనరులు ఇస్తు ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తున్నా శివా సేవకుల సేవలను కొనియాడారు, వివిధ రాష్ట్రలలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలు అన్ని ఓకే చోటా భక్తులకు దర్శనం చేసుకుని విధంగా ఏర్పాటు చేసిన సదుల సంతోష్ సువర్ణ దంపతుల కృషి అభినందనీయం అని అన్నారు.

### అమ్మా కోరిక నేరవేరింది

గత మహా శివరాత్రి రోజున అందుబాటులో ఉన్న శివా ఆలయాలు దర్శనం చేసుకొని రాయికల్ పట్టణం శివాలయంలో స్వామి వారిని దర్శనం చేసుకోగా మా అమ్మ సర్గీయ సదుల లక్ష్మీదేవి –మల్కయ్య ఈ ఆలయంలో ప్రశాంతంగా ఉంది అని అట్టి ఆలయానికి ఏదైన చేయాలని నాతో మాట తీసుకుంది ఇంతలో ఆమె మరణించగా ఆమె కోరికను తీర్చుటకు ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిమలను నిర్మాణం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సదుల సాహితీ ,సార్ దాసరి విద్యాసాగర్ ,రచన ,ఆశోక్ రాజ్యలక్ష్మి అందేసురేష్ నీలిమా గోల్డ్ గ్రూప్ సభ్యులు శివసేవకులు ఎనగందుల రమేష్ కడకుంట్ల జగదీశ్వర్ దాసరి గంగాధర్ కిష్టయ్య తదితరులు పాల్గోన్నారు.




## చీకట్లో ఫుడ్ బ్యాంక్ భైంసా ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 12: వొజ్జల సంతోషిని (?1000)రూపాయల ఆర్థిక సహాయంతో మరియు గత నెలలో మామిడి నమితా రెడ్డి లి పుట్టినరోజు సధర్భంగా వారి నాన్న (?1000లి) రూపాయల ఆర్థిక సహాయంతో ఈరోజు ఫుడ్ బ్యాంక్ భైంసా ఆధ్వర్యంలో భైంసా చుట్టూ పక్కల గల నిరుపేదలకు చిమ్మ చీకట్లో చైర్మన్ యం ఆంజనేయులు దాదాపు 60 మందికి అన్నదానం చేయడం జరిగింది. ఈ సంధ్భంగా మా అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ యం ఆంజనేయులు మాట్లాడుతూ.ఆహారాన్ని వృదా చేయకూడవద్దని మీ..మీ పుట్టిన రోజు సందర్భంగా..పెళ్లి రోజు సందర్భంగా వృదా కర్చు చేయకుండా పేదల ఆకలి తీర్చడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోరడం జరిగింది.ఈ మహత్తర కార్యక్రమానికి ప్రతి నెల సహాయం అందజేస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదములు తెలపడం జరిగింది.

## ఆన్ లైన్ మోసాలకు ఓటిపి పాస్ వర్డ్ జాగ్రత్త

### కే వై సీ మీ బ్యాక్ ఖాతాను సురక్షితంగా ఉంచండి

### సంగారెడ్డి లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ్ రావు

ఝరాసంగం ఫిబ్రవరి 11 (వాయిస్ టుడే): ఝరాసంగం మండల కేంద్రంలో మంగళవారం రోజున కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో, రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల భాగంగా పరిధిలోని ఒక గ్రామంలో కె.వై.సీ అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు మీ కస్టమర్‌ను తెలుసుకోండి (KYC) గురించి విస్తృతంగా అవగాహన కల్పించారు. సంగారెడ్డి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ్ రావు ఈ సందర్భంగా కె.వై.సీ పై పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, అన్ని బ్యాంక్ శాఖలు అవగాహన శిబిరాలు నిర్వహించి,ఖ్జకు అవసరమైన డాక్యుమెంట్లు వాటిని బ్యాంక్ ఖాతాలకు అనుసంధానం చేయడం వల్ల కలిగే లాభాలు విషయాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు.

బ్యాంక్ శాఖ లేదా వినియోగదారుల సేవా కేంద్రాన్ని సందర్శించే ప్రతి కస్టమర్‌కి KYC పరిశీలన చేసి, అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించేలా అవగాహన కల్పించాలి అన్నారు. ఇప్పుడు ఒకే బ్యాంకులో ఖ్జ అప్డేట్ చేస్తే, మిగతా అన్ని బ్యాంకుల్లోనూ ఆటోమేటిక్‌గా (KYC) అప్డేట్ అయ్యే విధానాన్ని --- జఖ్జ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విధానంలో 14 అంకెల జఖ్జ నంబర్ జారీ అవుతుంది. ఈ నంబర్‌ను ఇతర బ్యాంకుల్లోని మీ ఖాతాలకు అనుసంధానం చేస్తే తిరిగి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం ఉండదన్నారు.

# మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్




భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 12: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన ఈ వివరాలను వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా, ఎన్నికల నియమావళి ప్రకారం నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. రేపు ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, మొత్తం రెండు రౌండ్లలో 60 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి టేబుల్‌కు ఒక సూపర్వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో ఆబ్జర్వర్‌ను నియమించడంతో పాటు అవసరమైన రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి ఎన్నికల నియమావళి, ఓట్ల లెక్కింపు విధానం, అనుసరించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందించామని వివరించారు. ప్రతి దశలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించినట్లు తెలిపారు.

ఎన్నికల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీల్ చేసి భద్రపరిచినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందు అభ్యర్థులు లేదా వారి ఎన్నికల ఏజెంట్ల సమక్షంలోనే స్ట్రాంగ్ రూమ్‌లను తెరవనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సీసీటీవీ పర్యవేక్షణలో నిర్వహించబడుతుందని, ప్రతి టేబుల్ వద్ద పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేందుకు ప్రత్యామ్నాయ జనరేటర్ సౌకర్యం కల్పించామని, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు స్థాయిల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. అనుమతిపత్రాలు కలిగిన సిబ్బంది, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు అధీకృత మీడియా ప్రతినిధులను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా బృందాలను మోహరించినట్లు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రం పరిధిలో చట్టవ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయుటకు సెక్షన్ 163–బి అమలులో ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం ఐదుగురికిపైగా వ్యక్తులు గుమికూడరాదని, అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వదంతులు, అసత్య ప్రచారాలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక సైబర్ నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా, నియమావళి ప్రకారం నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, పాల్వంచ డిఎస్పి సతీష్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను హరించే 4 లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలి




వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా ఫిబ్రవరి 12 : జడ్చర్ల/ నవాబుపేట్ దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను మండలం కేంద్రం లో సీఐటీయ అధ్యర్యంలో అంబేద్కర్ చావరస్తా లో నిరసన కార్యక్రమం చేపట్టారు ర్యాలీ నిర్వహించడం జరిగిందని సిఐటియు నాయకులు ప్రశాంత్ మాట్లాడుతూ, ఆశా వర్కర్స్ లకు కనీసం వేతనం నెలకు 26000 ఇవ్వాలని అన్నారు. 2022 నుండి పెండింగ్ లో ఉన్న కనీస వేతన ని సవరించాలి. ఈఎస్ఐ బోనస్ పిఎఫ్ లపై ఉన్న సిలింగ్ లను ఎత్తివేయాలని అన్నారు ప్రతి నెల 7వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని తెలిపారు.విద్యుత్ చట్టం 2025 వెనక్కి తీసుకోవాలని తెలిపారు. జాతీయ విత్తన బిల్లు 2025 ను రద్దు చేయాలని తెలిపారు.రైల్వేలతో సహా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయాలన్న ఆలోచన మానుకోవాలని తెలిపారు.అందరికీ సార్వత్రిక నాణ్యమైన ఆరోగ్యం విద్యను అందించాలి. జాతీయ విద్యా విధానం 2020 ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, భవాని కార్మికుడు గోనెల రాములు, ఆశా వర్కర్లు నిర్మలమ్మ,, జయమ్మ, శ్రీ మతమ్మ, జ్యోతి, మంజుల, విజయ, విజయలక్ష్మి, సరోజ మాధవి, వరలక్ష్మి పాల్గొన్నారు.




## టిబి బాధితులకు ఉచిత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

### హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టిబి బాధితులకు అందజేత

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ భవన్‌లో గురువారం రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో 30 మంది టిబి (క్షయ) వ్యాధిగ్రస్తులకు ఉచిత న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయబడినాయి. ఈ కిట్లను రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ “ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్” లో భాగంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ తరపున 30 మంది టిబి బాధితులకు ఉచిత న్యూట్రిషన్ కిట్లు (పౌష్టికాహార పదార్థాలు,కోడిగుడ్లు,నిత్యావసర సరుకులు) దాతలు ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి,వాసవి ఫెర్టిలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాకేష్ వాసవి రెడ్డి,వంగ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ వంగ హేమంత్ రెడ్డి సహకారంతో జులై నెల నుండి ఆరు నెలల పాటు ప్రతి నెలా 30 మందికి న్యూట్రిషన్ కిట్లు పంపిణీ ఇప్పటివరకు 6 నెలలు పూర్తయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి,వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ,రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి.శ్రీనివాస్ రావు,జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్,టిబి బాధితులు,టిబి విభాగం సిబ్బంది మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోలూరులో తాగునీటి కష్టాలు తీర్చేందుకు నూతన బోరు బావి ఏర్పాటు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 11 : తాండూరు మండలం లో నీ కోలూరు గ్రామంలో వేసవిలో పాల్గొనేటి ఎద్దడి నివారించేందుకు స్థానిక సర్పంచ్ మాధవరావు మంగళవారం నాడు నూతన బోరు బావి తవ్వడానికి శ్రీకారం పట్టారు తిరుపతిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి బోర్ తవ్వకాన్ని మంగళవారం ప్రారంభించారు బోరులో తాగునీరు పుష్కలంగా పడడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు ప్రతి ఇంటికి తాగునీరు అందడమే మా లక్ష్యం అని సర్పంచ్ పేర్కొన్నారు నేటి సమస్య పరిష్కారం కృషి చేసినందుకు గ్రామస్తులు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలు వీడిసి మెంబర్లు యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## సర్పంచ్ శాంతమ్మ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కలెక్టర్ కు భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వినతి పత్రం

చేవెళ్ల....ఫిబ్రవరి 12: (వాయిస్ టుడే )శంకర్‌పల్లి మండలం మోకిల తండా గ్రామ సర్పంచ్ శాంతమ్మని ఎటువంటి సముచిత కారణం లేకుండా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం పట్ల భారతీయ గోర్ బంజారా పోరాట సమితి తీవ్రంగా ఖండించింది. శాంతమ్మ ఇటీవలే ఎన్నికై మూడు నెలలు కూడా పూర్తి కాకముందే పరిపాలనా బాధ్యతలు నిర్వర్తించే అవకాశాన్ని ఇవ్వకుండా సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన (ఎస్టీ) మహిళగా ఎన్నికైన ప్రజాప్రతినిధిని ఈ విధంగా వ్యవహరించడం గిరిజన సమాజానికి అవమానకరంగా ఉందన్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర నిధుల వినియోగంపై సరైన విచారణ లేకుండానే ఈ చర్య తీసుకున్నారని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. అందువల్ల ఈ సస్పెన్షన్‌ను తక్షణం ఉపసంహరించి, ఆమెను మళ్లీ సర్పంచ్ హోదాలో కొనసాగించేలా తగిన ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ అంశంపై సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ తదితరులకు లిఖితపూర్వకంగా వినతి పత్రాలను అందజేస్తామని చెప్పారు. అవసరమైతే సంబంధిత జాతీయ మానవ హక్కుల సంఘం, ఎస్సీ,ఎస్టీ కమిషన్ తదితర అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లడానికి మా సమితి సిద్ధంగా ఉంది. కలెక్టర్ ఈ విషయాన్ని సమగ్రంగా పునఃపరిశీలించి, న్యాయపరమైన విచారణ చేసి, సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయవలసిందిగా రాష్ట్ర సమితి తరపున విజ్ఞప్తి చేశారు.



## పరకాల మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

### హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పరకాల లోని గణపతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపునకు 7 టేబుల్స్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. మొత్తం పరకాల మున్సిపాలిటీ పరిధిలో 34 మంది పోస్టల్ బ్యాలెట్ లను వినియోగించుకున్నారని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్ లను కౌంటింగ్ కేంద్రంలో రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపును చేపడతారు. మొదటి రౌండ్లో 7 వార్డుల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, ఇందులో 1,15,12,6,9,17,4 వార్డుల ఓట్లను లెక్కిస్తారు. రెండో రౌండ్లో 2,16,13,7,10,19,5 వార్డుల ఓట్లను,మూడవ రౌండ్లో 3, 22,14,8,11,20,18 వార్డుల ఓట్లను, నాలుగవ రౌండ్ లో 21వార్డుకు సంబంధించిన ఓట్లను కౌంటింగ్ చేస్తారు. ప్రతి రెండు గంటలకు ఒక రౌండ్ కౌంటింగ్ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొత్తం 22వార్డుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసి ఫలితాలు వచ్చే విధంగా ఏర్పాట్లు చేసామని పేర్కొన్నారు. ఇందుకు ఎనిమిది మంది కౌంటింగ్ సూపర్వైజర్లు,18 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొంటారని తెలిపారు. రిటర్నింగ్ అధికారి,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి,మైక్రో అబ్జర్వర్లు పరిశీలనలో ప్రతి రౌండ్ వారీగా ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్,ఆర్డీవో,మున్సిపల్ కమిషనర్,తహసిల్దార్ కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు. పరకాల ఏసిపి ఆధ్వర్యంలో సుమారుగా 127 మంది పోలీసులు ఓట్ల లెక్కింపు సందర్భంగా బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. పరకాల మున్సిపాలిటీకి సంబంధించిన ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడించారు.

# వీళ్లు విద్యార్థుల? లేక కార్మికుల??

## తన దృష్టికి రాలేదని మాట దాటేసిన ఇంచార్జ్ ప్రిన్సిపాల్

## ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు..



కాజీపేట,వాయిస్ టుడే: కాజీపేటలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను చూస్తే వీళ్ళు విద్యార్థుల? లేక కార్మికుల? అనే సందేహం కలుగుతుంది. మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులతో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు చివరకు పాఠశాల అటెండర్లు కూడా పనులు చేయిస్తున్నారంటే విద్యార్థులను తమ స్వార్థం కోసం ఏ రకంగా వాడుకుంటున్నారో చెప్పవచ్చు.. గతంలో కూడా కాజీపేట–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకానికి సంబంధించిన బియ్యం బస్తాలు వ్యాన్ లో రాగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మిట్ట మధ్యాహ్నం విద్యార్థులతో మోయించినటువంటి ఘటనలు జరిగాయి. అది మరవకమునుపే బుధవారం కాజీపేట పట్టణంలోని 63వ డివిజన్ లో గల సోమిడి ప్రభుత్వ పాఠశాలలో ఏకంగా ఇద్దరు విద్యార్థులను గోడ మీదినుండి చెట్టు ఎక్కించి గొడ్డలితో కొమ్మలను కొట్టించిన ఘటన జరిగింది. ఇది చూసిన కొందరు స్థానిక యువకులు విద్యార్థులను వారిస్తూ చెట్టు మీద నుండికిందకు దింపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో కాజీపేట లోనే సోషల్ మీడియా గ్రూపులో చెక్కర్లు కొట్టింది. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులను తమ సొంత బిడ్డల్లాగా చూసుకోవాల్సిన ఉపాధ్యాయులు మాత్రం వారి చేత నానా చాకిరి చేయిస్తూ రాక్షసానందం పొందుతున్నారు. బుధవారం జరిగిన ఈ ఘటనపై స్థానిక ప్రజలు మండి పడుతున్నారు.

**నా దృష్టిలో లేదు.. ఇంచార్జ్ ప్రిన్సిపాల్**

బుధవారం సోమిటి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఈ ఘటన తన దృష్టిలో లేదని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సదానందం అంటున్నారు. పాఠశాలకు సంబంధించిన విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులకు తాము ఫిర్యాదు చేశామని..అయితే వారే వచ్చి చెట్లు కొడుతున్నారేమోనని అనుకున్నానని,ఆ సమయంలో తాను తరగతి గదిలో పాఠాలు చెబుతున్నానని..ఆ విషయం తన దృష్టికి రాలేదని ఆయన దాటవేస్తున్నారు విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను తీయమని పాఠశాలకు చెందిన అటెండర్ ను తాను ఆదేశించానని ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ అంటున్నారు. విద్యార్థులు చేసిన ఈ పనిలో ఒకవేళ దురదృష్టవశాత్తు విద్యార్థులు చెట్టు పైనుండి జారిపడిన లేదా చెట్టు కొమ్మలు కొట్టే సమయంలో విద్యుత్ తీగలు తెగి విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగిన ఎవరు బాధ్యత వహించే వారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా విద్యార్థుల చేత చెట్ల కొమ్మలు కొట్టించిన పాఠశాల ఉపాధ్యాయులపై విద్యాశాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటే తప్ప ఉపాధ్యాయులు,ఉద్యోగులు విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపరని ప్రజలు అంటున్నారు.

# లేబర్ కోడ్ లు రద్దు చేసే వరకు ఉద్యమిద్దాం

## రైతు ఉద్యమమే స్ఫూర్తిగా కార్మికుల ఉద్యమం

## ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

## బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘాలతో కలిసి బైక్,ఆటో ర్యాలీ

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 4 కార్మిక చట్టాలను రద్దు చేసి 29 పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని..లేబర్ కోడ్ లు రద్దు చేసే వరకు ఉద్యమిద్దాం అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ శాసనసభ్యులు,బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘాలతో కలిసి ఉద్యోగ కార్మిక హక్కుల సాధనలో భాగంగా జాతీయ సార్వత్రిక సమ్మె సందర్భంగా గురువారం బైక్,ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి కార్మికుల హక్కుల విషయమై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల లాభం కార్మికుడి కష్టంతో వస్తుందని,సంపన్నుల సంపద కార్మికుడి చెమట చుక్కతో పెరుగుతుందని అన్నారు. శ్రమ చేయడమే తెలిసిన కార్మికుడి కష్టాలు ఎక్కువ అని,నిత్యం పరిశ్రమించే కార్మికుడికి వేతనాలు తక్కువ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమ,స్వేదం తెలిసిన కార్మికులకు నేడు హక్కులు దక్కడం లేదని,అనునిత్యం పనిలో పోరాడినా ప్రతిఫలాలు ఉండడం లేదని వినయ్ భాస్కర్ విమర్శించారు. యాజమాన్యాల ఆర్థిక పురోగతి,శ్రామికుల అధోగతి పాలు అవుతున్నారని అన్నారు. అభివృద్ధి ఫలాలు కొందరికి దక్కుతున్నాయని,ఆకలి కేకలే శ్రమించే శ్రామికులకు మిగులుతున్నాయని అన్నారు.

కార్మికుడి శ్రమకు సెలవు లేదని,ఆ శ్రమ లేనిదే సంపద,విజయం లేదని తెలిపారు. అందుకే కార్మికులారా ఏకం అవుదామని వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. హక్కుల కోసం ఉద్యమిద్దామని,కుట్రలతో తొలగించిన హక్కులను కొట్లాడి సాధించుకుందామని అన్నారు. పోరాడిదే పోయేది మనల్ని బానిసలుగా మార్చే చట్టాలనే సంకెళ్లు ఐక్యంగా నిలబడదామని, కార్మిక శక్తిని చాటుదామని అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నూతన కార్మిక చట్టాల కారణంగా కార్మికులు వారి కనీస హక్కులను కోల్పోతున్నారని అన్నారు. పనికి తగ్గ వేతనం,సెలవులు,నిరసన తెలిపే హక్కులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని వివరించారు. మేనేజ్మెంట్ వారి పరిశ్రమలో పని చేసే ఉద్యోగిని హైర్ అండ్ ఫైర్ విధానంలో తీసుకొనే అవకాశం ఉందని తెలిపారు. కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకోవడం హక్కుల సాధనకు ఉద్యమిస్తే వారిని తొలగించే ప్రమాదంలో ఉద్యోగులు ఉంటారని.. ఈఎస్ఐ,పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు పొందలేని పరిస్థితి భవిష్యత్‌లో రాబోతోందని ఈ నూతన కార్మిక చట్టాల ద్వారా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యూనియన్లను ఏర్పాటు చేసుకునే హక్కును సైతం కోల్పోతారని అన్నారు.



కార్మికుల హక్కుల కోసం అన్ని సంఘాలు ఏకమై కేంద్రంపై పోరాడుదామని పిలుపునిచ్చారు. రైతు ఉద్యమమే స్ఫూర్తిగా కార్మికులందరం ఉద్యమిద్దామని సూచించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని.. జాతీయ సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ హనుమకొండ జిల్లా కన్వీనర్ నాయిని రవి,మా తెలంగాణ ఆటో యూనియన్ అధ్యక్షులు ఈసంపల్లి సంజీవ,శ్రీధర్ రెడ్డి,బాబు, ప్రతాపరుద్ర ఆటో యూనియన్ నరహరి,సాంబయ్య,ఎఅతీఎ యూనియన్ నాయకులు చిలువేరు బిక్షపతి,రఘుపతి రెడ్డి,నారాయణగిరి రాజు,సిద్దిక్, పెయింటర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజారపు రాజు,నాయకులు కార్మిక నాయకులు తిరుపతి సాంబయ్య,చారి,చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు ఎం.డి ఇస్మాయిల్,హమాలి సంఘ నాయకులు విజయ్,తదితర సంఘాల నాయకులు అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాల్సిందే..

## సిఐటియూ మహా ప్రదర్శనలో బొట్ల చక్రపాణి డిమాండ్




హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే విధంగా రూపొందించిన 4 లేబర్ కోడ్లను మరియు విబి జీ రామ్ జీ బిల్లును రద్దు చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి బోట్ల చక్రపాణి కేంద్రం ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా హుజురాబాద్ రోడ్డులోని పెట్రోల్ పంపు నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా అమరధామం వరకు డప్పు చప్పులతో కార్మిక మహాప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షులు బొట్ల ప్రభాకర్ అధ్యక్షత వహించగా చక్రపాణి పాల్గొని మాట్లాడుతూ కార్మికులు దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు మేలు చేకూరేలా కేంద్రం ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్లు తెచ్చారని వీటి ఫలితంగా కార్మికులు యజమానులకు పనిచేయాల్సి వస్తుందని ఆయన మండిపడ్డారు.

కార్మికుల హక్కులను కాలరాస్తూ 'హైర్ అండ్ ఫైర్' (నియమించు–తొలగించు) పద్ధతిని చట్టబద్ధం చేయడం,12 గంటల పని పెంపుదల,సమ్మె చేసే హక్కు కనీస వేతనం ఉద్యోగ భద్రత లాంటి చట్టబద్ధ హక్కులు లేకుండా పనిచేయాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని 50సంవత్సరాల పైబడిన వారికి తొమ్మిది వేల పెన్షన్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ సమ్మెలో విద్యుత్ సవరణ చట్టం–2025, విత్తన సవరణ బిల్లు మరియు ఎల్ఐసిలో 100 శాతం విదేశీ పెట్టుబడుల అనుమతి వంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని అయన డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం,ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాల అధికారాలను కేంద్రం హస్తగతం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఈ సమ్మెలో సుమారు 40 కోట్ల మంది సంఘటిత,అసంఘటిత కార్మికుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ఈ మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు లంకదాసరి అశోక్,వివిధ సంఘాల నాయకులు, నరసింహులు,బచ్చు ఆదాం, సాంబయ్య, రమేష్, మోహన్,పసుల సారయ్య,పైడి ఉపేందర్, రాజేందర్, సారంగపాణి, సుధాకర్, కుమార్, ప్రమోద్, కోటయ్య, పసుల సారయ్య,వసంత, కమల, రాధా, కుమారస్వామి తోపాటు 300 మంది భవనం, హమాలి,మున్సిపాల్ కార్మికులు పాల్గొన్నారు.



# కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటం కొనసాగుతుంది

## పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

## ఆటోలో ర్యాలీగా వెళ్లి సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే నాయిని

## సార్వత్రిక సమ్మెకు వరంగల్‌లో విశేష స్పందన

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: కార్మికుల సంక్షేమం,హక్కుల పరిరక్షణ కోసం ఎప్పుడూ అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను బలహీనపరుస్తున్నాయని విమర్శిస్తూ వాటి రద్దు కోసం పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన సార్వత్రిక సమ్మెకు వరంగల్‌లో విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,కార్మిక సంఘాల నాయకులు,కార్యకర్తలు వందలాది బైక్‌లతో ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం వరకు ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ నుంచి వేలాదిమంది కార్మికులు కలెక్టరేట్ వరకు మహా ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వయంగా ఆటో నడుపుతూ ర్యాలీలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ర్యాలీ మొత్తం బీజేపీ ప్రభుత్వం,ప్రధాని నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలతో మార్మోగింది. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో పలువురు కార్మిక సంఘాల ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమలుతో ఉద్యోగ భద్రత తగ్గిపోవడం,ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ విధానం విస్తరించడం,కాంట్రాక్ట్ వ్యవస్థ పెరగడం వంటి పరిణామాలు కార్మికుల జీవన భద్రతను దెబ్బతీస్తాయని అన్నారు. సమ్మె హక్కును పరిమితం చేయడం, యాజమాన్యాలకు అధిక అధికారాలు ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కార్మికుల ప్రధాన డిమాండ్లు అయిన 8 గంటల పని దినం అమలు,స్థిర ఉద్యోగాలు కల్పించడం,ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ విధానాన్ని రద్దు చేయడం,కనీస వేతనం 26వేల రూపాయలు చట్టబద్ధంగా అమలు చేయడం,ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద భీమా వంటి సామాజిక భద్రతా పథకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యలను రాష్ట్ర అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంగన్వాడీ, ఆశా, మున్సిపల్, యూనివర్సిటీ,ఆటో,భవన నిర్మాణ,మెడికల్ రిప్రజెంటేటివ్స్,మధ్యాహ్న భోజన,హాస్పిటల్ కార్మికులు తదితర రంగాలకు చెందిన వేలాదిమంది ఈ సమ్మెలో పాల్గొన్నారు. కార్మికులు,రైతులు కలిసి పోరాడుతున్న ఈ ఐక్యత ప్రభుత్వానికి స్పష్టమైన సందేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజా,కార్మిక,రైతు వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి,కుడా చైర్మన్,డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి,సిఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్,సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏం.చుక్కయ్య,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజు గౌడ్,ఐఎఫ్‌టీయూ నాయకులు అప్పారావు,రాజేందర్,ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి హంసారెడ్డి,ఏఐసిటియూసీ జిల్లా కార్యదర్శి వి.ఎస్.రావు,ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కూర వెంకటేశ్వర్లు,సిఐటియూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సారంపల్లి వాసుదేవరెడ్డి,ఐద్వా జిల్లా కార్యదర్శి దీప,తదితర నాయకులు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మరియు వేలాదిమంది కార్మికులు పాల్గొన్నారు.



# హనుమకొండలో SS లుడ్వినా-లువినా' బేకరీ ప్రారంభం

## ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ, వాయిస్ టుడే: నగరంలోని గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు సమీపంలో వస్కుల శైలజ–శ్రీధర్ దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన "రూా ాఖణఎఎ×చీూా –ాఖఎ×చీూా " (రూా లుధ్వినా–లువినా) కేక్స్ అండ్ బేకరీని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గురువారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా బేకరీ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ఎమ్మెల్యే నాయిని కి నిర్వాహక కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా సన్మానించి తమ కృతజ్ఞత భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,రాజకీయ నాయకులు,బేకరీ నిర్వాహకుల కుటుంబ సభ్యులు మరియు మిత్రులు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న నిర్మల్ డ్రైవర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) : నిర్మల్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్ ఫోను డ్రైవర్ నిజాయితీగా తిరిగి అందజేశాడు హైదరాబాద్ నుండి నిర్మల్ వస్తున్న బస్సులో నర్సాపూర్ కు చెందిన సత్తయ్య తన సెల్ ఫోన్ ను మరిచిపోయాడు బస్సు డిపోకు చేరుకున్న అనంతరం తనిఖీ చేయగా ఫోన్ లభ్యమైనది సెల్ ఫోన్ ఆధారంగా ప్రయాణికుని పిలిపించి మంగళవారం ఫోన్ అప్పగించారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**